


# వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
PRGI No: TGTEL/26/A2290



వార్త వేకువ
విలేకర్లు కావలెను.
వార్త వేకువ తెలుగు దినపత్రికకు
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లో నియోజకవర్గం మరియు మండల స్థాయిలో వార్తల సేకరణ కొరకు రిపోర్టర్లు కావలెను. జర్నలిజంపై ఆసక్తిగల వారికి అవకాశం కల్పిస్తున్నాము. ఆసక్తిగలవారు ఈ క్రింది చిరునామాను సంప్రదించవచ్చును.
సెల్ - 9133444314



ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : ఆవనగంటి అనిల్ కుమార్ సంపుటి : 01 సంచిక : 32 వెల : 4 పేజిలు : 08 సోమవారం 01 - 06 - 2026


## ఎండలున్నాయ్ జాగ్రత్త ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి

- ప్రజలకు మోదీ మరోసారి సూచనలు
- ప్రధాని మోదీ 'మనసులో మాట' 134వ ఎపిసోడ్
- ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ
- మన్‌కీ బాత్‌లో గుర్వీందర్, అనిమేష్‌తో మాట్లాడిన ప్రధాని



**వార్త వేకువ , ఢిల్లీ, మే 01 :**
మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలని మరోసారి సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఎండల నుంచి ఉపశమనం కోసం తాగే పానీయాల గురించి ప్రధాని ప్రస్తావించారు. మజ్జిగ, షర్బత్, తదితర పానీయాలను తాగాలని ప్రజలకు సూచించారు. ఆ తర్వాత కేరళ ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. - మిగతా 2 లో

## వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం

- డీల్ ఖరారు చేసిన భారత్
- వియత్నాంకు బ్రహ్మోస్ క్షిపణుల అమ్మకంపై భారత్ ఒప్పందం పూర్తి
- ఇండోనేషియాతోనూ ఇదే తరహా ఒప్పందం తుది దశలో ఉందని వెల్లడి
- సింగపూర్‌లో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ కీలక ప్రకటన
- దక్షిణ చైనా సముద్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఒప్పందాలకు ప్రాధాన్యం
- రక్షణ ఎగుమతులను భారీగా పెంచుకోవడంపై భారత్ దృష్టి




**వార్త వేకువ , ఢిల్లీ, మే 01 :**
రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి 'బ్రహ్మోస్'ను వియత్నాంకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం - మిగతా 2 లో

## బెంగాల్‌లో ఉద్రిక్తత.. అభిషేక్ బెనర్జీ తర్వాత మరో టీఎంసీ ఎంపీపై దాడి!

- హుగ్లీ జిల్లాలో ఎంపీ కల్యాణ్ బెనర్జీపై చేయిచేసుకున్న జనం
- 'దొంగ దొంగ' నినాదాలతో వెల్లువెత్తిన నిరసన
- అభిషేక్ బెనర్జీ ఘటన మరుసటి రోజే మరో దాడి



**వార్త వేకువ , పశ్చిమ బెంగాల్ , మే 01 :**
పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతలపై దాడులు కలకలం రేపుతున్నాయి. పార్టీలో కీలక నేత అభిషేక్ బెనర్జీపై దాడి జరిగిన మరుసటి రోజే, ఈ ఉదయం మరో ఎంపీ సొంత నియోజకవర్గంలోనే దాడికి గురయ్యారు.వివరాల్లోకి వెళితే.. హుగ్లీ జిల్లాలోని చండీతాలలో ఎంపీ కల్యాణ్ బెనర్జీ పర్యటిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా - మిగతా 2 లో

## విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు

- ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ కీలక ప్రకటన
- విశాఖపట్నం-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు వస్తుందన్న మాధవ్
- కేవలం గంటన్నరలోనే 350 కిలోమీటర్ల ప్రయాణం
- నేటి నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్




## రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఏపీ ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక 'యోగాంధ్ర-2026' కు శ్రీకారం
- రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర-2026 నిర్వహించాలని సీఎం ఆదేశం
- కోటి మంది భాగస్వామ్యమే లక్ష్యంగా కార్యక్రమం
- జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించాలన్న సీఎం చంద్రబాబు



**వార్త వేకువ , అమరావతి, మే 01 :**
అంతర్జాతీయ యోగా దినోత్సవం వేళ కోటి మంది భాగస్వామ్యమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక 'యోగాంధ్ర-2026' కు శ్రీకారం చుట్టింది. జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.జూన్ 21న అమరావతిలోని కృష్ణా నది బ్రిడ్జిపై 25 వేల మందితో నిర్వహించే ప్రధాన రాష్ట్ర స్థాయి వేడుకలో సీఎం చంద్రబాబు స్వయంగా పాల్గొననున్నారు. ఇందుకు అన్ని శాఖలను సమన్వయం చేస్తూ, జిల్లాకు రూ. 25 లక్షల నిధులతో పాటు ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించిన ప్రత్యేక డిజిటల్ వీడియోలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. యోగంధ్ర నిర్వహణపై ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా యోగాంధ్ర-2026 నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా యోగాంధ్ర 2026పై తలపెట్టిన - మిగతా 2 లో

## జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన



- పెట్టుబడులే టార్గెట్
- రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి లోకేష్ రష్యా పర్యటన
- జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్న లోకేష్
- సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం
- పర్యటనలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న మంత్రి

**వార్త వేకువ , అమరావతి, మే 01 :**
రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటించనున్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటించి, పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో - మిగతా 2 లో



## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం

- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం
- ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక
- ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపేనని ఆరోపణ
- పోలీసులు చూస్తూ ఉన్నా దాడిని ఆపలేదని విమర్శ
- విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరిక
- నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్

**వార్త వేకువ , అమరావతి, మే 01 :**
నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. - మిగతా 2 లో



## మరో పది రోజుల్లో తెలంగాణకు నైరుతి రుతుపవనాలు!

- కేరళ, తమిళనాడు వైపు వేగంగా విస్తరిస్తున్న గాలులు
- రాష్ట్రంలో క్రమంగా తగ్గనున్న పగటి ఉష్ణోగ్రతలు
- ఈరోజు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం

**వార్త వేకువ , హైదరాబాద్, మే 01 :**
భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు - మిగతా 2 లో

## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు అధికారికంగా ప్రకటించాలి



- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలన్న కవిత
- రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఈ ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరిక

**వార్త వేకువ , హైదరాబాద్, మే 01 :**
రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల - మిగతా 2 లో

## ఈ ఏడాది చివర్లో జీహెంచ్ఎంసీ ఎన్నికలు !

- సీఎంసీ, ఎంఎంసీలకు విడిగా ఆ తర్వాత!
- మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో మొదటగా జీహెంచ్ఎంసీకే ఎన్నికలు
- బీసీ సర్వే రిపోర్టుల ఆధారంగా రిజర్వేషన్ల ఖరారు
- సర్ పేరుతో జరగనున్న ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగియనుంది
- అనంతరం ఎన్నికల ప్రకటన
- ఊపందుకోనున్న ప్రక్రియ




**వార్త వేకువ , హైదరాబాద్, మే 01 :**
రాజధాని మహా నగరం హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో తొలుత జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్)కే ఎన్నికలు జరగబోతున్నాయి. నవంబరులో ఎన్నికలు నిర్వహించాలని సంబంధిత అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సర్ పేరుతో జరగనున్న ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగియనుంది. దీంతో ఆ ఓటరు జాబితా ఆధారంగా అదే నెలలో కొత్తగా ఏర్పడిన డివిజన్లకు పోలింగ్ సెంటర్లను నిర్ణయిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన సర్వే రిపోర్టుల - మిగతా 2 లో

# సంపాదకీయం

## చర్చలు--దాడులు



ఒకపక్క చర్చలు, మరోవైపు దాడులతో పశ్చిమాసియా శాంతి కథ నడుస్తోంది. తాత్కాలిక కాల్పుల విరమణ అమలులో ఉండగా, మంగళవారం దక్షిణ ఇరాన్‌మీద అమెరికా జరిపిన దాడులు అత్యంత తీవ్రమైనవి. క్షిపణులను మోహరిస్తున్నదనీ, మందుపాతరలు అమరుస్తున్నదనీ ఆరోపిస్తూ ఇరాన్‌మీద జరిపిన ఈ దాడిని అమెరికా ఆత్మరక్షణగా చెప్పుకుంది. ప్రతీకారం తప్పదని హెచ్చరించిన ఇరాన్ సైతం అమెరికా విమానాన్నీ, ఒక అత్యున్నతస్థాయి డ్రోన్‌ను కూల్చివేసింది. ఖతార్ చర్చల్లో ఒకరీతిగా, యుద్ధక్షేత్రంలో మరోవిధంగా ప్రవర్తించడం ద్వారా అమెరికా నిజంగానే ఇరాన్‌తో సయోధ్యకు సిద్ధంగా ఉన్నదా, లేక ఏకపక్షంగా ఆరంభించిన ఈ యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నదా అన్న అనుమానాలు కలగకమానవు.ఇరుపక్షాలు మళ్ళీ తీవ్రయుద్ధానికి ఉపక్రమించే అవకాశాలు ప్రస్తుతానికి తక్కువే. కానీ, ఎంతో కష్టంమీద ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఏవో కారణాలతో ఉల్లంఘిస్తూ పోతే శాంతి సాధన అసాధ్యం. చిన్నదాడికి కూడా ప్రతీకారం తప్పదని హెచ్చరించి, ఎంతోకొంత స్థాయిలో దానికి బదులు తీర్చుకోవాల్సిన స్థితి. లెబనాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఏమాత్రం గౌరవించడం లేదు. హిజ్బొల్లాతో సాగుతున్న యుద్ధం పూర్తిగా నిలిచిపోయి, సామాన్యులకు ఊరట దక్కింది లేదు. మంగళవారం నాటి ఇజ్రాయెల్ దాడుల్లో యాభైమంది వరకూ లెబనాన్ పౌరులు మరణించినట్టు వార్తలు వచ్చాయి. అణుకార్యక్రమం, హోర్ముజ్ దిగ్బంధం వంటి కీలకమైన అంశాల్లో ఇప్పటికీ అమెరికా--ఇరాన్ మధ్య సయోధ్య కుదరలేదు. శాంతి ఒప్పందం ఎంతో దూరంలో లేదన్నమాట ఎప్పటినుంచో వినబడుతున్నదే. ఏదో ఒక విధంగా హోర్ముజ్‌ను విముక్తం చేస్తామని అమెరికా ఇంకా చెబుతూనే ఉంది కానీ, క్షేత్రస్థాయిలో మార్పు కనబడటం లేదు. ఈ జలసంధి విషయంలో అడుగుముందుకు పడిందని ఉభయపక్షాల్లో ఎవరు చెప్పినా, అసత్యప్రచారం పేరిట మరొకరు ఖండించడం కొనసాగుతోంది. హోర్ముజ్‌ను తెరిచేందుకు ఉద్దేశించిన ముసాయిదాకు అమెరికా అంగీకరించిందన్న ప్రచారం కూడా ఇటువంటిదే.ఒప్పందం కోసం ఇరాన్ అర్రులుచాస్తోంది కానీ, అందుకు తగిన వాతావరణం ఇంకా ఏర్పడలేదని ట్రంప్ తన మంత్రివర్గ సమావేశం సందర్భంలో ఓ వ్యాఖ్య చేశారు. రూబియో వ్యాఖ్యలు కూడా ఇంచుమించుగా అలాగే ఉన్నాయి. యుద్ధానికి తాము సిద్ధమే కానీ, దౌత్యానికే ప్రాధాన్యం అంటున్నారు వీరిద్దరూ. చర్చలు చక్కగా సాగుతున్నాయంటూనే, ఇరుపక్షాలూ కనీసం ఒక్క అంశంలో కూడా ఏకమాటగా లేకపోవడం, అన్ని విషయాల్లోనూ ఖండించుకోవడం విచిత్రం. మూడు నెలలుగా ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో పరోక్ష చర్చలు సాగుతున్నప్పటికీ వ్యవహారం పెద్దగా ముందుకు కదలకపోవడం విశేషం. దీనికితోడు ఇరాన్‌తో శాంతిచర్చల్లో పాల్గొంటున్న దేశాలు అబ్రహాం ఒప్పందంపై సంతకాలు చేయడం వంటి ప్రతిపాదనలతో ట్రంప్ సరికొత్త అడ్డంకులను సృష్టిస్తున్నారు. ఖతార్‌లో చర్చలు చివరి అంకంలో ఉండగా ఇరాన్‌మీద మళ్ళీ దాడికి దిగడం, ఇజ్రాయెల్ ఉనికి, దురాక్రమణలకు నైతికతను చేకూర్చే అబ్రహాం ఒప్పందాలమీద సంతకాలు చేయాలంటూ ముస్లిందేశాల మీద ఒత్తిడి తీసుకురావడం వంటి పరిణామాలు వ్యూహాత్మకమైనవి. ఎక్కువ దేశాలు తన ప్రతిపాదనను కాదుపొమ్మంటాయని ట్రంప్‌కు తెలియకపోదు. ఇజ్రాయెల్‌పై నమ్మకం లేనందున ఈ ఒప్పందంలో చేరేది లేదని పాకిస్తాన్ వెంటనే వ్యాఖ్యానించింది. ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి దీనిని ఒక కీలకమైన మెట్టుగా ముందుకు తెచ్చి, క్రమంగా ఒక బలమైన డిమాండ్‌గా మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వల్లనే ఇరాన్‌తో ఒప్పందం కుదరడం లేదని ట్రంప్ సన్నిహిత సెనెటర్ లిండ్సే వంటివారు ఎదురుదాడి ఆరంభించారు కూడా. ట్రంప్ తొలివిడత పాలనలో ఓ నాలుగుదేశాలు ఈ ఒప్పందాలపై సంతకాలు చేసిన మాట నిజం. ఇన్నేళ్ళపాటు ఊరుకొని, అప్పట్లో ససేమిరా అన్న మిగతాదేశాలను ఇప్పుడు ఒత్తిడిమీద లొంగదీయాలని అమెరికా అనుకుంటోంది. పూర్తిగా ఇజ్రాయెల్ పక్షాన నిలబడిన అమెరికా అధ్యక్షుడు ఇంకా ఎంతకాలం ఈ చర్చల అంకాన్ని కొనసాగిస్తూ ప్రపంచాన్ని మాయచేస్తారో చూడాలి.

## జూన్ 2 నుంచి రష్యాలో నారా లోకేష్ పర్యటన

మొదటిపేజీ తరువాయి - పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, వారిని ఏపీకి ఆహ్వానించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్' సదస్సులో పాల్గొనాల్సిందిగా మంత్రి లోకేష్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు.ఈ పర్యటనలో భాగంగా, లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, విద్య, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి - నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు.ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

## బెంగాల్‌లో ఉద్రిక్తత.. అభిషేక్ బెనర్జీ తర్వాత మరో టీఎంసీ ఎంపీపై దాడి!

మొదటిపేజీ తరువాయి - సిబ్బంది జనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే కొందరు ఆయన తలపై కొట్టారు. ఈ అనూహ్య పరిణామంతో ఆయన తల పట్టుకుని కిందపడిపోయారు. ఈ ఘటనతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.దాడికి ముందు కొందరు వ్యక్తులు కల్యాణ్ బెనర్జీకి నల్ల జెండాలు చూపిస్తూ 'చోర్ చోర్' (దొంగ దొంగ) అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శనివారం దక్షిణ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో అభిషేక్ బెనర్జీ పర్యటనలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. ఆయన పర్యటనలోనూ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవగా.. 'చోర్ చోర్' అంటూ నినాదాలు చేశారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు కీలక టీఎంసీ నేతలపై ఒకే తరహాలో దాడులు, నిరసనలు జరగడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు

మొదటిపేజీ తరువాయి - కవిత డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళు తున్నాయని ఆమె మండిపడ్డారు.రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర

మొదటిపేజీ తరువాయి - కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. యోగాంధ్ర -2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాజధాని అమరావతిలో 25 వేల మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు.జిల్లాకు రూ.25 లక్షల చొప్పున నిధులు: రాజధాని ప్రాంతంలోని కృష్ణా నదీ వంతెనపై యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్ నిర్మాణంలో భాగంగా నదిపై నిర్మించిన బ్రిడ్జిపై కార్యక్రమం ఇంటర్నేషనల్ యోగా డే జూన్ 21న నిర్వహిస్తారు. అదే రోజు జిల్లా కేంద్రాల్లో 1000 మందితో నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో నిర్వహించాలని సీఎం సూచించారు. మొత్తంగా కలిపి కోటి మంది భాగస్వాములు అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 1.50 లక్షల మంది ట్రైనర్లకు అదనంగా మరో లక్ష మందిని ట్రైనర్లుగా చేసేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఒక జిల్లా ఒక థీమ్ తో 14 రోజుల యోగాంధ్ర నిర్వహిస్తారు. జిల్లాల్లో యోగాంధ్ర నిర్వహణకు జిల్లాకు రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు.పోస్టర్‌ను



ఆవిష్కరించిన సీఎం: ఆరోగ్య, మానవవనరులు, మునిసిపల్, పంచాయతీ రాజ్, దేవాదాయ, ఐటీ శాఖల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ టూరిస్టు ప్రాంతాల్లో అంటే 56 టూరిస్టు కేంద్రాల్లో ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తారు. ఒక రోజు రెండు జిల్లాల చొప్పున 500 మందితో టూరిస్టు ప్రాంతాల్లో యోగా నిర్వహిస్తారు. అలాగే 14 రోజుల పాటు పార్కులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహి స్తారు. యోగాంధ్ర ఈవెంట్స్ కు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవార్డులు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు యోగాంధ్ర నిర్వహణకు సంబంధించి రూపొందించిన పోస్టర్ ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ: యోగాపై అవగాహనకు, శిక్షణకు తాను చేపట్టిన కార్యక్రమాలను సత్యనారాయణ రాజు సీఎంకు వివరించారు. 90 ఆసనాల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనాలు వీడియోలు, రోజు వారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణాయామంపై 7 వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలు-సమాధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైనులో పెట్టనున్నట్లు తెలిపారు. మీడియా, సోషల్ మీడియా, వివిధ డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ ద్వారా వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు.అంతేకాకుండా 8142404888 నెంబర్ కు హాయ్ అని మెసేజ్ పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఈ వీడియోలను డౌన్ లోడ్ చేసుకోవచ్చని సత్యనారాయణ రాజు వివరించారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్ తో పాటు సీఎస్ సాయి ప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులంతా పాల్గొన్నారు.

## 'ఎండలున్నాయ్ జాగ్రత్త - ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి'

మొదటిపేజీ తరువాయి - 15 వేల మంది ఔత్సాహికులకు క్లబ్ నిర్వాహకులు ఉచితంగా ఈత నేర్పించారని తెలిపారు. ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ నాలుగు విభాగాల్లో క్రీడాకారులు రికార్డులు సృష్టించారని అన్నారు. వంద మీటర్ల పరుగులో గుర్వీందర్, అనిమేష్ రికార్డులు సృష్టించారని వెల్లడించారు. ఈ సందర్భంగా గుర్వీదర్, అనిమేష్ పరుగు పందెంలో తమ అనుభవాలను ప్రధాని మోదీతో పంచుకున్నారు. అలాగే, పురాణ కాలం నాటి అపూర్వ సంపద గురించి మోదీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా చోళుల కాలం నాటి తామర పత్రాల విశిష్టత, ఛత్తీస్‌గఢ్‌లో లభించిన పాండవుల కాలం నాటి తామరపత్రాల గురించి వివరించారు."కొద్ది రోజుల క్రితం నెదర్లాండ్స్‌ను సందర్శించే అవకాశం నాకు లభించింది. అక్కడ నేను అనేక సమావేశాల్లో పాల్గొన్నాను. అయితే, అక్కడ జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో చోళుల కాలం నాటి పురాతన రాగి ఫలకాలను భారత్‌కు అప్పగించారు. అంతేకాదు, ఆ కార్యక్రమానికి నెదర్లాండ్స్ ప్రధాని కూడా హాజరయ్యారు. ఈ ఫలకాల గురించి దేశం నలుమూలలు, విదేశాల నుంచి నాకు నిరంతరం సందేశాలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ సమాజాల్లో కూడా ఒక ప్రత్యేకమైన ఉత్సాహం నెలకొని ఉంది. వీటిలో 21 పెద్ద, 3 చిన్న రాగి ఫలకాలు ఉన్నాయి. అవి ప్రధానంగా మొదటి రాజేంద్ర చోళ మహారాజుకు సంబంధించినవి. ఆనైమంగళం గ్రామాన్ని బౌద్ధ విహారానికి ఇచ్చినట్లు ఇందులో పేర్కొన్నారు. అవి చోళ రాజవంశం విజయాలను వివరిస్తాయి. ఆ రాజవంశం బలమైన సముద్ర శక్తిని చూపిస్తాయి. ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి. చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం. అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది."ఖగోళ శాస్త్రం తరతరాలుగా భారతీయులను ఆకర్షించిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి బెంగళూరు ఖగోళ సొసైటీ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించిందని మోదీ నొక్కి చెప్పారు. అలాగే, రాత్రిపూట నక్షత్రాలను చూడటం అనేది ఒక అద్భుతమైన అనుభవమని, ఆస్ట్రో కేరళ అనే సంస్థ రాత్రిపూట పరిశీలన శిబిరాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. అక్కడి యువత టెలిస్కోపులు తయారు చేయడం, నక్షత్ర పటాలను ఉపయోగించడం నేర్చుకుంటున్నారని అన్నారు. "రాజ్‌కోట్‌లోని బిగ్ బ్యాంగ్ ఆస్ట్రానమీ క్లబ్ గిర్ అడవుల నుంచి రాన్ ఆఫ్ కచ్ వరకు అనేక ఖగోళ శాస్త్ర కార్యక్రమాలను నిర్వహించింది" అని మోదీ అన్నారు.మరోవైపు, తమిళనాడులోని నాగర్‌కోయిల్‌కు చెందిన విద్యావేత్త గిరిజా అమ్మ గురించి మోదీ మాట్లాడారు. ఆమె చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయంతో సహా 15 పాఠశాలలను నడుపుతున్నారని చెప్పారు. ఆమె దేశభక్తి స్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఉత్తేజం ఇస్తుందన్నారు. "మన్ కీ బాత్ స్ఫూర్తితో, ఆమె దేశంలోని అనేక మంది సైనికులకు విరాళం ఇవ్వడానికి ప్రతిజ్ఞ చేశారు. ఇది



చేయడానికి, ఆమె తన పాఠశాలలన్నింటిలోని విద్యార్థులను ప్రేరేపించారు. ధైర్యవంతులైన సైనికుల కోసం ప్రతిరోజూ ఒక రూపాయి విరాళంగా ఇవ్వమని ఆమె పిల్లలను కోరారు. అంటే, ప్రతి విద్యార్థి ఒక సంవత్సరంలో 365 రూపాయలు సేకరించారు. ఈ చిన్న విరాళాల ద్వారా సుమారు 40 లక్షల రూపాయలు సేకరించారు" అని మోదీ పేర్కొన్నారు.చెన్నైలోని మొట్టమొదటి హిందూ పాఠశాల గత సంవత్సరం తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుందని మోదీ పేర్కొన్నారు. "దేశ విద్య, సాంస్కృతిక గౌరవాన్ని పెంపొందించడంలో ఈ పాఠశాలల పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయం. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ నేను అభినందిస్తున్నాను. ముఖ్యంగా మన ధైర్యవంతులైన సైనికులకు విరాళాలు అందించిన విద్యార్థులను ప్రశంసిస్తున్నాను. భారతదేశంలోని ప్రతి గ్రామంలో, నగరంలో మనకు స్ఫూర్తినిచ్చే ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

## వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం




మొదటిపేజీ తరువాయి - ఇండోనేషియాతో కూడా తుది దశలో ఉందని భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక షాంగ్రీ-లా డైలాగ్ భద్రతా సదస్సులో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు."వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందం ఇప్పటికే పూర్తయింది. బహుశా బహిరంగంగా ప్రకటించనప్పటికీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇండోనేషియాతో చర్చలు కూడా తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఒప్పందం ఖరారు కావచ్చు" అని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.నివేదికల ప్రకారం వియత్నాంతో కుదిరిన ఒప్పందం విలువ సుమారు రూ. 5,800 కోట్లు. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ, ఇతర సాంకేతిక సహకారం అందించనున్నారు. భవిష్యత్తులో వియత్నాం గగనతలం నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ క్షిపణులను కూడా కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ సుమారు 375 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందంతో బ్రహ్మోస్‌ను కొనుగోలు చేసిన తొలి విదేశీ దేశంగా నిలిచింది. ఇప్పుడు వియత్నాం, త్వరలో ఇండోనేషియా కూడా ఈ జాబితాలో చేరనున్నాయి.దక్షిణ చైనా సముద్రంలో చైనాతో తీవ్రమైన ప్రాదేశిక వివాదాలు ఎదుర్కొంటున్న వియత్నాం, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు తమ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న తరుణంలో ఈ ఒప్పందాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ధ్వని కన్నా మూడు రెట్ల వేగంతో (మాక్ 3) ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించవచ్చు. దీని వేగం, కచ్చితత్వం కారణంగా శత్రువుల యుద్ధ నౌకలను, కీలక సైనిక స్థావరాలను వేగంగా ఛేదించగలదు.2020 గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో తన వ్యూహాత్మక ప్రభావాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తోంది. రక్షణ ఎగుమతులను 2030 నాటికి రూ. 50,000 కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

## ఈ ఏడాది చివర్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు !

మొదటిపేజీ తరువాయి - ఆధారంగా డివిజన్ల రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. ఆ రెండు ప్రక్రియలు పూర్తవగానే నవంబరులో ఎన్నికల ప్రకటన జారీ అవుతుందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో మొదట జీహెచ్ఎంసీకి మాత్రమే ఎన్నికలు నిర్వహించడానికి రెండు కారణాలున్నట్లు నిపుణులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసి మూడు కార్పొరేషన్లుగా ఫిబ్రవరిలో పునర్విభజించింది. ఫిబ్రవరి 10, 2026న జీహెచ్ఎంసీ పాలక మండలి గడువు పూర్తవగా ఫిబ్రవరి 11, 2026న జీహెచ్ఎంసీ పునర్విభజనలో భాగంగా కొత్తగా ఎంఎంసీ (మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్), సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) ఏర్పాటయ్యాయి. మూడు కార్పొరేషన్లకూ జీహెచ్ఎంసీ చట్టమే వర్తిస్తుంది. ఆ చట్టం ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి గడువు పూర్తయిన ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.ఈ నిబంధన గతంలో ఎన్నికలు జరిగిన ఒక్క జీహెచ్ఎంసీకి మాత్రమే వర్తిస్తుంది. పునర్విభజనతో బాహ్య వలయ రహదారి పరిధిలో స్థానిక సంస్థల రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. దాదాపు 28 అసెంబ్లీ నియోజకవర్గాలున్న మూడు కార్పొరేషన్ల పరిధిలో ఏ కార్పొరేషన్‌ను ఏ పార్టీ కైవసం చేసుకుంటుందనే అంచనాలపై రాజకీయ వర్గాల్లో తీవ్రమైన ఆందోళన నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకారం జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలో 60 నుంచి 70 స్థానాలు ఓ ప్రముఖ పార్టీకి దక్కే అవకాశం ఉంది. మిగిలిన స్థానాల్లో పూర్తిగా త్రిముఖ పోటీ ఉంటుందని అంచనాకు వస్తున్నారు. ప్రజాభిప్రాయాన్ని విశ్లేషించుకుని సీఎంసీ, ఎంఎంసీలకు ఎన్నికల నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం.పాత జీహెచ్ఎంసీలోని కొంత భాగం మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లకు బదలాయింపు అయింది. శంషాబాద్ నుంచి ఆదిభట్ల వరకు ఉన్న పలు స్థానిక సంస్థలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిశాయి. దాంతో గ్రేటర్ ఎన్నికల్లో ఆయా స్థానిక సంస్థల పరిధిలోని డివిజన్లలో ప్రజల తీర్పు ఎలా ఉంటుందనే విషయమై ఉత్కంఠ నెలకొంది.జీహెచ్ఎంసీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం కింద ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం డిస్కౌంట్‌ను కల్పిస్తోంది. హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు క్యూర్ పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతాల్లో రూ.2300 కోట్ల ట్యాక్స్ వసూలైనట్లు మున్సిపల్ శాఖ గతంలోనే ప్రకటించింది. జీహెచ్ఎంసీ పరిధిలో 11 లక్షల 45 వేల 321 నిర్మాణాలు ఉండగా వాటి పరిధిలో రూ.863 కోట్ల




ప్రాపర్టీ ట్యాక్స్ వసూలైంది. అలాగే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9 లక్షల 43 వేల 432 భవనాలుండగా రూ. 916 కోట్లు ఆదాయం సమకూరింది. మల్కాజ్‌గిరి కార్పొరేషన్‌లో 7 లక్షల 91 వేల 507 నిర్మాణాలకు రూ. 502 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు బల్దియా తెలిపింది.

## మరో పది రోజుల్లో తెలంగాణకు నైరుతి రుతుపవనాలు!

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ 10 నుంచి 12వ తేదీ మధ్య తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎండల తీవ్రత తగ్గి, వర్షాలు ప్రారంభం కానున్నాయి.ప్రస్తుతం కేరళ, దాని పరిసర ప్రాంతాల్లో విస్తరించిన నైరుతి రుతుపవనాలు రానున్న నాలుగైదు రోజుల్లో తమిళనాడులోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనాల కారణంగా రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. లక్షద్వీప్, కొమోరిన్ ప్రాంతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయి.రుతుపవనాల రాకతో రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులు క్రమంగా తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా దేహాగాన్‌లో రికార్డు స్థాయిలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, రానున్న రోజుల్లో ఉపశమనం లభించనుంది. జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు 36-38 డిగ్రీలకు, ఇతర జిల్లాల్లో 40-42 డిగ్రీలకు తగ్గుతాయని అంచనా. జూన్ 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 38-39 డిగ్రీల మధ్య స్థిరపడనున్నాయి. కాగా, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు

మొదటిపేజీ తరువాయి - ఆంధ్రప్రదేశ్‌లో రవాణా రంగానికి సంబంధించి ఒక శుభవార్త వెలువడింది. విశాఖపట్నం-విజయవాడ నగరాల మధ్య బుల్లెట్ రైలు (హైస్పీడ్ రైల్) ప్రాజెక్టును తీసుకురానున్నట్లు ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ వెల్లడించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా తనకు ఈ విషయాన్ని తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే, ఇరు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.మరోవైపు, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ (ూశీబ్ష్ట జశ్లీర్ ఝఅశ్రీఝఎ్గ శీఅవ) రేపటి నుంచి (జూన్ 1) విశాఖపట్నం కేంద్రంగా అధికారిక కార్యకలాపాలు ప్రారంభించనుందని మాధవ్ స్పష్టం చేశారు. ఈ జోన్ సాధన కోసం బీజేపీ సుమారు 30 ఏళ్లుగా పోరాటం చేసిందని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుతం విశాఖ-విజయవాడ మధ్య రైలు ప్రయాణానికి 5 నుంచి 6 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే, ఈ 350 కిలోమీటర్ల దూరాన్ని కేవలం గంటన్నరలోనే పూర్తి చేయవచ్చని అంచనా. ఈ రైలును తొలుత గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడపాలని, భవిష్యత్తులో వేగాన్ని మరింత పెంచాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ కారిడార్ విజయవాడ నుంచి ఏలూరు, రాజమండ్రి, కాకినాడ మీదుగా విశాఖపట్నం చేరేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'ఫైనల్ లొకేషన్ సర్వే' అనుమతుల కోసం క్షేత్రస్థాయి అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో ఏపీ మీదుగా ఇప్పటికే మూడు వెళ్తుండగా, ఇది రాష్ట్రానికి అదనపు ప్రయోజనం చేకూర్చనుంది. దీంతో పాటు విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. ఈ కొత్త ప్రాజెక్టులు ఉత్తరాంధ్రతో పాటు మొత్తం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిస్తాయని భావిస్తున్నారు.

వార్త వేకువ
తెలుగు దినపత్రిక
నిజం వైపు నిరంతరం...
సోమవారం 01 - 06 - 2026

# పహిల్వాన్ పూర్‌లో ఏ జి ఐ గ్లాస్ ఫ్యాక్టరీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన సర్పంచ్ బద్దం కరుణ శ్రీ పవన్ కుమార్ రెడ్డి



**వలిగొండ మే 31 (వార్త వేకువ) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పూర్: గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏ జి ఐ గ్లాస్ ఫ్యాక్టరీ వారి సహకారంతోలి, సర్పంచ్ బద్దం కరుణ శ్రీ పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు బీపీ, షుగర్, జనరల్ చెకప్‌లు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు చేతి కర్రలు, నడుము పట్టీలు, మోకాలి పట్టీలు సర్పంచ్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తుల ఆరోగ్యమే తమ ప్రధాన లక్ష్యమని, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సహకరించిన ఏ జి ఐ గ్లాస్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి శిబిరాలు నిరంతరం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన సర్పంచ్ బద్దం కరుణశ్రీ పవన్ కుమార్ రెడ్డి



**వలిగొండ మే 31 (వార్త వేకువ) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పూర్: గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన సర్పంచ్ బద్దం కరుణ శ్రీ – పవన్ కుమార్ రెడ్డి ఎండలో పని చేస్తున్న కూలీలకు స్వయంగా నిమ్మరసం అందించారు. పని ప్రదేశానికి వెళ్లి కూలీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి తాపం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మంచినీరు ఎక్కువగా తాగాలని సూచించారు. మస్టర్ రికార్డులు పరిశీలించి పని నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గారు మాట్లాడుతూ కూలీల ఆరోగ్యమే ముఖ్యమని, పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ స్నేహలత ఫీల్డ్ అసిస్టెంట్ విజయ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## బాసర ఐఐటి లో సీటు సాధించిన ఎన్‌సీసీ క్యాండెట్ పి. ఉదయశ్రీ



**వలిగొండ మే 31 (వార్త వేకువ) :** వలిగొండ మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థిని, ఎన్‌సీసీ క్యాండెట్ పి. ఉదయశ్రీ ఐఐఐటీ బాసర ప్రథమ దశ ప్రవేశ ఫలితాలలో ఎన్‌సీసీ కోటా ద్వారా సీటు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డా. సీతారామరాజు తెలిపారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులు విద్యా రంగంలో కూడా విశేష ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాలను సంప్రదించాలని కోరారు. అలాగే, 6వ తరగతి ప్రవేశాల కోసం మోడల్ స్కూల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు 8వ తరగతి నుండి ఎన్‌సీసీలో చేరేందుకు అర్హులవుతారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పి. ఉదయశ్రీని పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ అధికారులు, తల్లిదండ్రులు అభినందించారు..

## మర్కోడు గ్రామా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు సర్పంచ్ వినతిపత్రం అందజేత



**భద్రాద్రి జిల్లా మే 31 (వార్త వేకువ) :** మర్కోడు మండల కేంద్రంలోని మర్కోడు గ్రామపంచాయతీ సర్పంచ్, సుతారి రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు, నాయకులు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు.గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, డ్రైనేజీ మరియు ఇతర ప్రజా సమస్యలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుతారి కృష్ణ, మహిళా నాయకురాలు షేక్ పర్వీన్, దొడ్డి రాము, ముప్పారపు రాము, జనగం సాయి, వేమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



**నూతనకల్.. మే 31 (వార్త వేకువ) :** మండల పరిధిలోని గుండ్ల సింగారం ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన (1999- 2000) బ్యాచ్) విద్యార్థిని విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను,అనుభవాలను ఒకరికి ఒకరు పంచుకొని ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. 25 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకొని తమ జ్ఞాపకాలను నెమర వేసుకొని అమితానందాన్ని పొందినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ గౌడ్ మల్లయ్య దయాకర్ రెడ్డి సుభాష్ మురళి ముత్తయ్య మాణిక్యం అశోక్ పెంటయ్య సాహిన సంధ్య జ్యోతి కవిత ఉమా రేణుక విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలతో కలిసి విస్తృత స్థాయి ప్రజా పర్యటన



**మేడిపల్లి, మే 31; (వార్త వేకువ):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ వినాయక్ నగర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు,సీనియర్ నాయకులు,డివిజన్ అధ్యక్షులు,కార్యదర్శులు, కార్యకర్తలు కాలనీ ప్రజలతో కలిసి విస్తృత స్థాయి ప్రజా పర్యటన నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించారు. కాలనీలో ప్రధాన సమస్యగా తాగునీటి కొరత ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జలమండలి అధి కారులు వెంటనే స్పందించి కనీసం వారానికి రెండు రోజులైనా క్రమ బద్ధమైన నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాలనీలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయి నెలల తరబడి అలాగే ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. వినాయక్ నగర్‌లోని అనేక గల్లీలు,ఖాళీ స్థలాలు చెత్త కుప్పలతో నిండిపోయిన దృశ్యాలను బీఆర్ఎస్ నాయకులు ప్రత్యక్షంగా పరిశీలించారు.ఇండ్ల మధ్యలో ఉన్న ఖాళీ ప్లాట్లలో చెత్త పేరుకు పోవడంతో దుర్వాసన వెదజల్లు తోందని, దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని స్థానికులు వివరించారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అధి కారులపై ఒత్తిడి తీసుకు వస్తామని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం,గృహ నిర్మాణ పథకాల వంటి అంశాల్లో ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొన సాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొల్తూరి మహేష్,కౌడే పోచయ్య, నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లిలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం

### పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, మే 31 (వార్త వేకువ) :** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో చక్రిపురంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సార్, బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ బూత్ లెవల్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణను మరింత విస్తరించేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని ఆయన పేర్కొన్నారు.పార్టీ నిర్మాణాన్ని గ్రామ, వార్డు స్థాయిలో మరింత బలోపేతం చేయడంలో సభ్యత్వ నమోదు ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యాచరణపై చర్చించారు.

## ఈసీఐఎల్‌లో అను ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

### యువ పారిశ్రామికవేతలకు ప్రోత్సాహం

### - స్థానికులకు నాణ్యమైన ఆహార సేవలు అందుబాటులోకి



**కాప్రా, మే 31 (వార్త వేకువ) :** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార సేవలు అందించాలనే లక్ష్యంతో ఈసీఐఎల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన అను ఫుడ్ కోర్ట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఫుడ్ కోర్ట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఆయన యజమాని వెంకట్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇలాంటి వ్యాపార సంస్థలు మరిన్ని ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు.నిర్వాహకుల వివరాల ప్రకారం, అను ఫుడ్ కోర్ట్‌లో వెజ్, నాన్‌వెజ్ వంటకాలతో పాటు టిఫిన్స్, మీల్స్, బిర్యానీ, చైనీస్ తదితర రకాల రుచికరమైన వంటకాలు అందుబాటులో ఉండనున్నాయి.వినియోగదారులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోమ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి విశిష్ట సేవలందించిన ప్రిన్సిపాల్ దొడ్డి భద్రయ్య

### పదవీ విరమణ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**భద్రాద్రి జిల్లా మే 31 (వార్త వేకువ) :** ఉపాధ్యాయుని గా పనిచేసి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగారు.విద్యా సేవలో అంకితభావం, క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచి విద్యారంగంలో 37 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ దొడ్డి భద్రయ్య పదవీ విరమణ కార్యక్రమం మణుగూరు పట్టణ కేంద్రం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై దొడ్డి భద్రయ్యని ఘనంగా సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్ గా, పరిపాలన దక్షకుడిగా దొడ్డి భద్రయ్య చేసిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. వేలాది మంది విద్యార్థులకు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బందికి మార్గదర్శకుడిగా నిలిచి విద్యా రంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని ప్రశంసించారు.విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి, తన, అనుభవం తోసేవలందించాలని, ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, విద్యార్థులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## గ్రామ దీపికల సమస్యలు పరిష్కరించాలి.

### 12వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు.



**కొణిజర్ల మే 31 (వార్త వేకువ) :** కొనిజర్ల మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐకెపి వివో ఏ రాష్ట్ర కమిటీ జేఏసీ పిలుపుమేరకు గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ ఖమ్మం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ వైరా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఏక కాలికంగా పెండింగ్లో ఉన్న అపను డిమాండ్లను పరిష్కరించాలని వివోలో కనీస వేతనం 20వేలకు పెంచాలని సెరపఉద్యోగులుగా పరిగణించి హెచ్ఆర్స్ పాలసీ చేయాలని అర్హులైన వివో ఏ లకు సిసిలుగా పదోన్నతి అనిపించాలని సామాజిక ఆరోగ్య భీమా సౌకర్యం టాబు సౌకర్యం కల్పించాలని జీవో నెంబర్ 58 సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న మా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సమస్యల హక్కులను డిమాండ్లను సానుకూలంగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మాణిక్యం కార్యదర్శి ధనలక్ష్మి కొత్తపల్లి పద్మ అరుణ శివమణి నాగమణి ఆదిలక్ష్మి సుజాత లలిత శ్రీవాణి సైదులు వెంకటేశ్వర్లు నవీన్ కొనిజర్ల మండలం పాల్గొన్నారు.

## కాప్రాలో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

### రోడ్లు, డ్రైనేజీలు, ఓపెన్ జిమ్‌లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణాలతో మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి



**కాప్రా, మే 31 (వార్త వేకువ):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా, వంపుగూడ డివిజన్లలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ పనుల ద్వారా కాలనీల్లో రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, వినోద సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.ఈ అభివృద్ధి పనుల్లో సీనియర్ సిటిజన్ కాలనీలో రూ.40 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, సాకేత్ కాలనీలో రూ.25 లక్షలతో ఓపెన్ జిమ్ మరియు చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు, వోర్లా ఎన్‌క్లేవ్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, కాప్రా నాలా నుంచి సాయి సుమా టీ-జంక్షన్ వరకు రూ.2.50 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం, గాంధీనగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.ఈ పనులు పూర్తయిన అనంతరం వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గడంతో పాటు రవాణా, పారిశుధ్య సౌకర్యాలు మెరుగుపడి స్థానిక ప్రజలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బైరి నవీన్ గౌడ్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సారపాక లో నూతన పెట్రోల్ బంకును ప్రారంభించిన ఉపసర్పంచ్ కన్నె దారి రమేష్



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మే 31 (వార్త వేకువ) :** బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సారపాక నుండి నాగినేని ప్రోలు రెడ్డిపాలెం కు వెళ్లే మూలమలుపు దాటిన తర్వాత శ్రీనివాస ఫ్యూయల్ పార్క్ (పెట్రోల్ బంక్) నూతనంగా ఏర్పాటు చేయగా అట్టి బంకును రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించిన సారపాక మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కన్నదారి రమేష్. ఈ సందర్భంగా కన్నె దారి రమేష్ మాట్లాడుతూ ఇండస్ట్రీ ఏరియాగా పేరుగాంచిన సారపాక ప్రాంతంలో 40 వేల పైచిలుకు జనాభా నివసిస్తున్న ప్రాంతంలో వాహనదారులు ఎక్కువగా ఉండడం సారపాకలో ఒకటే పెట్రోల్ బంకు ఉండడంవల్ల వాహనదారులు పెట్రోల్, డీజిల్ కొరకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న టైంలో మరో పెట్రోల్ బంకును ప్రారంభించడం వల్ల వాహనదారుకు సౌకర్యంగా ఉంటుందని తెలియజేశారు. కస్టమర్లు యొక్క ఉనికిని తెలుసుకున్నట్లయితే కస్టమర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమనికి గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వైరాకు శాశ్వత తాహసిల్దారును నియమించాలి.

### పూర్తిస్థాయి తహసీల్దార్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం.



**వైరా మే 31 (వార్త వేకువ):** వైరా నియోజకవర్గ కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో శాశ్వత తహసిల్దార్ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం తెలిపారు. ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలు సకాలంలో అందకపోవడంతో పరిపాలనలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైరా మండల ప్రజలు ఆదాయ కుల నివాస వారసత్వ ధ్రువీకరణ పత్రాలు తదితర సేవల కోసం కార్యాలయానికి పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి నెలకొన్నది అని అన్నారు. కార్యాలయంలో సరిపడా సిబ్బంది లేకపోవడం పూర్తి స్థాయి అధికారులు కలిగిన తహసిల్దార్ లేకపోవటం వల్ల ప్రజల సమస్యలు పేరుకు పోతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఇన్చార్జి తహసీల్దార్ తో పరిపాలన కొనసాగుతుండటంతో అనేక పరిపాలన నిర్ణయాలు పెండింగ్లో పడుతున్నాయని, అభివృద్ధి పనులు రెవెన్యూ సంబంధిత అంశాలు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. కార్యాలయ నిర్వహణకు అవసరమైన నిధులు సిబ్బంది కొరత కూడా ప్రజలకు ఇబ్బందిగా మారిందని అన్నారు. వైరా వంటి ముఖ్యమైన నియోజకవర్గ కేంద్రానికి శాశ్వత తహసిల్దారును నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు . జిల్లా నూతన కలెక్టర్ వెంటనే స్పందించి వైరాకు పూర్తిస్థాయి అధికారులు పరిధిలో శాశ్వత తహసీల్దార్ ను నియమించి కార్యాలయంలో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని భూక్య వీరభద్రం తెలిపారు.

# సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వైయస్సార్ సిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి శశికళ కృష్ణమోహన్



**కర్నూలు :** విజయవాడలో నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి మహిళా విభాగ సమావేశంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కురువ శశికళ కృష్ణమోహన్, పార్టీ సీనియర్ నాయకుడు మరియు మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా విభాగం బలోపేతం,పార్టీ కార్యక్రమాల విస్తరణ, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. మహిళా నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని,మహిళల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని సజ్జల రామకృష్ణారెడ్డి సూచించినట్లు పేర్కొన్నారు.అనంతరం శశికళ కృష్ణమోహన్ మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిచ్చే రాజకీయ పార్టీ అని అన్నారు.మహిళా సాధికారత కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తోడ్పడిందని గుర్తు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మహిళా నాయకులు మరింత ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.రానున్న రోజుల్లో మహిళా విభాగాన్ని మరింత చైతన్యవంతం చేసి, ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చిందన్నారు.ఆలూరు నియోజకవర్గంలో కూడా మహిళా కార్యకర్తలను సంఘటితం చేసి పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తామని శశికళ కృష్ణమోహన్ వెల్లడించారు. మహిళల సంక్షేమం,స్వయం ఉపాధి,విద్య,ఆరోగ్య రంగాలకు సంబంధించిన సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర సమావేశం విజయవంతంగా సాగిందని, పార్టీ నాయకత్వం ఇచ్చిన దిశానిర్దేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి మహిళా నాయకులు సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి మహిళా నాయకులు,పార్టీ ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు - మంత్రి ఎన్ఎండి ఫరూక్ హెచ్చరిక

## వైఎస్సార్ విగ్రహం ధ్వంసం వెనుక వైకాపా కుట్రపూరిత రాజకీయాలు

### మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి





**నంద్యాల :** రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి,అలజడులు సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుట్రపూరిత డ్రామాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు . ఈరోజు నంద్యాల పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారితో పాటు రాష్ట్ర రోడ్లు,భవనాలు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి, జోనల్ 5 టిడిపి ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం ఎల్లప్పుడూ ప్రశాంతతకు, మతసామరస్యానికి మారుపేరని,ఇక్కడి ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు . నంద్యాలలో చోటుచేసుకున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం ఘటనపై మంత్రి స్పందిస్తూ, ఆ విగ్రహాన్ని తాము పగులగొట్టాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో,రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులే ఈ విధమైన చౌకబారు విమర్శలు మరియు నాటకాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. గతంలో కోడికత్తి డ్రామాలు ఆడిన చరిత్ర వారిదేనని,ఇప్పుడు కూడా అలాంటి కుతంత్రాలనే పునరావృతం చేస్తున్నారని విమర్శించారు.నంద్యాలలో మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి మంత్రిగా ఉన్నారనే అక్కసుతో,ఇక్కడి నుండి బేస్ చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులతో తాము ఇప్పటికే మాట్లాడామని, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, ఇటువంటి పనికిమాలిన పనులు చేసే అరాచక శక్తులను మరియు దోషులను కఠినంగా శిక్షించాలని ఆదేశించినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు దూసుకుపోతోందని మంత్రి ఫరూక్ తెలిపారు . నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి అడ్డుపడే ప్రయత్నం చేశాయని ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాంతంలో భూగర్భ జలాల రీఛార్జ్ కోసం, తాగునీరు మరియు సాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం రాత్రింబవళ్లు శ్రమిస్తోందని,ఎండకాలంలో కూడా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా అందిస్తున్నామని గుర్తుచేశారు.రైతులకు మద్దతు ధర ఇచ్చి జొన్నలు, మామిడి కాయలు వంటి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని వివరించారు. తాము ఎప్పుడూ శాంతియుత రాజకీయాలనే నమ్ముకున్నామని, సుమారు 45 ఏళ్లుగా ఒకే పార్టీలో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నానని, ఎన్నడూ పార్టీలు మారలేదని మంత్రి ఫరూక్ తెలిపారు. ఇటువంటి అరాచక శక్తుల ఆటలు సాగనివ్వబోమని, ప్రజలంతా వాస్తవాలను గమనిస్తున్నారని ఆయన తెలిపారు . నంద్యాల ప్రశాంతతకు భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ సందర్భంగా మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ఉదయం నంద్యాల పట్టణంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహాన్ని వైకాపా అనుచరుడే స్వయంగా ధ్వంసం చేసి, ఆ నెపాన్ని తెలుగుదేశం పార్టీపై నెట్టేందుకు ఒక పక్కా ప్లాన్ ప్రకారం ప్రయత్నించాడని ఆధారాలతో సహా నిరూపించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడు 'చాకలి జంబులయ్య' అనే వ్యక్తి అని, అతను వైకాపా స్థానిక కౌన్సిలర్ మరియు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అనుచరుడనడానికి తగిన ఫోటో ఆధారాలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మీడియాకు విడుదల చేశారు. నిందితుడు జంబులయ్య, అతని భార్య వైకాపా నాయకులతో కలిసి ఉన్న ఫోటోలను సాక్ష్యాలుగా చూపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విధ్వంసాలు సృష్టించడం, అల్లర్లు లేపడం కొత్తేమీ కాదని, అది వారి సంస్కృతిలోనే ఉందని మంత్రి విమర్శించారు. గతంలో అధికారంలోకి రావడానికి 'కోడికత్తి డ్రామా' ఆడారని, మొన్నటి ఎన్నికలలో జనాదరణ కోల్పోయాక సానుభూతి కోసం 'గులకరాయి నాటకం' ఆడారని గుర్తుచేశారు. చివరకు సొంత బాబాయ్ వై.ఎస్. వివేకానంద రెడ్డి ని దారుణంగా నరికి చంపించి, ఆ బ్లేమ్‌ను ఇతరులపై వేయడానికి ప్రయత్నించిన అరాచక చరిత్ర జగన్ మోహన్ రెడ్డి దని మంత్రి తెలిపారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, నిరుద్యోగ నిర్మూలనపై దృష్టి పెట్టిందని మంత్రి స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేస్తుంటే, ఆ అపఖ్యాతిని కప్పిపుచ్చడానికి వైకాపా ఈ విధమైన చిల్లర రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ప్రశాంత వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు గారిదేనని, తప్పు చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా చట్టం ముందు సమానులేనని ఆయన అన్నారు.

# వైఎస్సార్ విగ్రహం ధ్వంసం ఘటనపై రాజకీయ దుమారం

## కూటమి నేతల కుట్రేనని వైసీపీ

## ఆరోపణలు.. సమగ్ర విచారణకు డిమాండ్









**నంద్యాల :** నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్ సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం ధ్వంసం ఘటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన వెనుక అధికార కూటమి పార్టీల నేతల కుట్ర ఉందంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.శనివారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి,ఎమ్మెల్సీ ఇసాక్ బాషా,వైసీపీ సీఈసీ సభ్యుడు పి.పి.నాగిరెడ్డి, రాష్ట్ర ఈసీ సభ్యుడు సాయినాథ్ రెడ్డి,నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, నంద్యాల అసెంబ్లీ పరిశీలకుడు,సూర్యనారాయణ రెడ్డి తదితరులు విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.అనంతరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి,శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి మాట్లాడుతూ,రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల అభిమానాన్ని పొందిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.ఘటన జరిగిన కొద్దిసేపటికే నిందితుడు వైసీపీ కార్యకర్త అని కొందరు సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేశారని ఆరోపించారు.అయితే, నిందితుడు జంబులయ్య గతంలోనే వైసీపీని వీడి టీడీపీ,జనసేన పార్టీలతో అనుబంధం కలిగి ఉన్నాడని వారు పేర్కొన్నారు.దీనికి సంబంధించిన ఫోటోలు, ఫ్లెక్సీలను కూడా మీడియా ముందు ప్రదర్శించారు.2024 ఎన్నికల అనంతరం కూటమి నేతలతో కలిసి దిగిన ఫోటోలు కూడా ఉన్నాయని, అలాంటి వ్యక్తిని వైసీపీ కార్యకర్తగా చిత్రీకరించడం సరికాదని అన్నారు.ఘటన జరిగిన సమయంలో విగ్రహం పరిసరాల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉందని నాయకులు పేర్కొన్నారు.నిందితుడి వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.నంద్యాలలో శాంతిభద్రతల పరిస్థితిపై కూడా వైసీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. విగ్రహ ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులతో పాటు,ఈ ఘటన వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి ధ్వంసమైన విగ్రహాన్ని పునరుద్ధరించాలని, అవసరమైతే కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు.లేకపోతే ప్రజల సహకారంతో తామే ముందుకు వచ్చి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేస్తామని హెచ్చరించారు.ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన ఈ వ్యవహారంలో వాస్తవాలు ఏమిటన్నది విచారణ పూర్తయిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు విజయశేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,మహేశ్వర రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు,మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ గొప్ప ప్రపంచ పండితుడు -ప్రొఫెసర్ చిన్నస్వామి సోసలే





**కర్నూలు :** ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గొప్ప ప్రపంచ పండితుడని హంపి కన్నడ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ చిన్నస్వామి సోసలే పేర్కొన్నారు.ఆదివారం బళ్లారి నగరంలోని జోలదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో నిర్వహించిన బళ్లారి జిల్లా చాలవాడి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రారంభోత్సవం, అలాగే ఎస్ఎస్-ఎల్సీ, పీయూసీ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన చాలవాడి వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సామాజిక వివక్షను స్వయంగా అనుభవించిన అంబేద్కర్ సమాజంలోని అసమానతలను లోతుగా అర్థం చేసుకొని రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. అంటరానితనం,వివక్ష, సామాజిక అన్యాయాలపై అంబేద్కర్ చేసిన పోరాటం దేశానికి మార్గదర్శకమైందన్నారు. అంబేద్కర్‌ను కేవలం దేవుడిగా కాకుండా గొప్ప జ్ఞాని,సామాజిక తత్త్వవేత్తగా చూడాల్సిన అవసరం ఉందని సూచించారు.నేటి పిల్లలే రేపటి పౌరులని పేర్కొంటూ, అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలను యువత అర్థం చేసుకుని వాటిని జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని,భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా అంబేద్కర్ పార్కుల నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు.**"మనది చెమట చిందించిన చరిత్ర"**మన సమాజ చరిత్ర యాత్రల చరిత్ర కాదని,కష్టపడి సాధించిన చెమట చిందించిన చరిత్ర అని ప్రొఫెసర్ సోసలే పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొనసాగుతున్న దేవదాసి వంటి అనైతిక,అమానవీయ ఆచారాలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో మాట్లాడిన చలవాడి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్.కె.బసవరాజ్, రాష్ట్రంలో దళిత సామాజిక సంఘాల శక్తిని రాజకీయ నాయకులు సమర్థవంతంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు.సమాజ బలోపేతానికి రాజకీయ నాయకులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆర్. గంగాధరయ్య,నగర డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) పి.వి. గోవిందరాజులు,చాలవాడి మహాసభ జిల్లా అధ్యక్షుడు నరసప్ప,గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.సోమనాథ్ తదితరులు ప్రసంగించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గూలప్ప బెల్లెకట్టే మాట్లాడుతూ,సమాజ అభివృద్ధికి విద్య,సంఘటిత శక్తి ఎంతో అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు. అలాగే ఎస్ఎస్ఎల్సీ, పీయూసీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 140 మందికి పైగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసి ప్రోత్సహించారు.సంఘం ప్రధాన కార్యదర్శి హనుమప్ప అతిథులకు,సభికులకు స్వాగతం పలికారు.సీనియర్ పాత్రికేయుడు సి.మంజునాథ్ పరిచయ ప్రసంగం చేశారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ ప్రతినిధి కమలరత్న బంతేజీ, వెంకటరమణ,సి.ఆర్. హనుమంత,శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆలూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ జోన్-5 రీజనల్ కోఆర్డినేటర్ పెళ్లికూరు శ్రీనివాసులు రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు



**ఆదోని :** ఆదోని పట్టణంలోని విమల రెసిడెన్స్‌లో తెలుగుదేశం పార్టీ జోన్-5 రీజనల్ కోఆర్డినేటర్ పెళ్లికూరు శ్రీనివాసులు రెడ్డి గారిని దేవనకొండ మండల మైనార్టీ నాయకుడు సుభాన్, టీడీపీ సీనియర్ నాయకుడు మధు,పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి,తెలుగుదేశం పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం,ప్రజలకు పార్టీ సంక్షేమ కార్యక్రమాలను చేరవేయడం,స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు,రహదారులు, విద్యుత్,ఉపాధి వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు.అలాగే పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను మరింత చురుకుగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని పెళ్లికూరు శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు.పార్టీ శ్రేణులంతా ఐకమత్యంతో ముందుకు సాగితే ఆలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో పలువురు స్థానిక నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొని నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## మెగా శాఖాహార అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు





**కర్నూలు :** శాఖాహారాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు... నగరంలోని రాఘవేంద్ర నగర్ లో గల బుద్ధ పిరమిడ్ ధ్యాన కేంద్రం నుంచి ధ్యాన కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా శాఖాహార అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంబి ంచారు..అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రోజూ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభించడంతో పాటు, ఒత్తిడి, ఆందోళన తగ్గి ఏకాగ్రత పెరుగుతుందన్నారు..ఇక తాను కూడా రోజు ధ్యానం చేస్తానని, ధ్యానం చేయడం ద్వారానే ప్రశాంతతో మొదటి సారి ఎంపీ టికెట్ ఇచ్చినా ఆ ఒత్తిడిని అదిగమించి విజయం సాధించానన్నారు..ఇక జంతు హింసను నివారించడం మరియు పర్యావరణ పరిరక్షణకు శాకాహారం ఎంతో దోహదపడుతుందని ఎంపీ తెలిపారు.. ఈ కార్యక్రమంలో బుద్ధ పిరమిడ్ ధ్యాన కేంద్రం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# ఆదోనిలో మర్యాదపూర్వక భేటీ

## ఆలూరు నియోజకవర్గ టీడీపీ బలోపేతంపై విస్తృత చర్చ



**ఆదోని :** ఆదోని పట్టణంలోని విమల రెసిడెన్స్‌లో జోన్-5 రీజనల్ కోఆర్డినేటర్ పెళ్లికూరు శ్రీనివాసులు రెడ్డిని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు,గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన,ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు.అదేవిధంగా తెలుగుదేశం పార్టీ సంస్థాగత బలోపేతం,గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించడం,పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది.ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు.పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్న నాయకులు,గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ప్రతి నాయకుడు,కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగగా, ఆలూరు నియోజకవర్గ అభివృద్ధి మరియు పార్టీ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలపై చర్చించినట్లు సమాచారం.స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం,పార్టీ విస్తరణ,ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు నిర్ణయించినట్లు తెలిసింది.

# నూతన దంపతులను ఆశీర్వదించిన టిడిపి నాయకులు

## టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఈబిజి గోవిందు గౌడ్

**హొళగుంద :** మండల కేంద్రంలోని స్థానిక టిడిపి మైనారిటీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహ్మాన్ అక్క కుమార్తె వివాహ వేడుకల్లో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గోవింద్ గౌడ్, నాయకులు డి ఎస్ భాషా, ముల్లా మొయిన్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ నేపథ్యంలో వధూవరుల కుటుంబ సభ్యులకు షాదీ ముబారక్ శుభాకాంక్షలు తెలిపి, నూతన వధూవరుల దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఇరు కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు. నూతన వధూవరుల కుటుంబ సభ్యులు టిడిపి నాయకులకు శాలువాపూర్ మారుతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, నాయకులు ఇబాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**హొళగుంద :** జిల్లాలోనే ఎంతో విశిష్టతను సంతరించుకున్న మండలంలోని దేవరగట్టు శ్రీ మాల సహిత మల్లేశ్వర స్వామికి ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు మనోహర్ స్వామి స్వామివారికి ఆకు పూజ కుంకుమార్చన మహా మంగళహారతి బండారార్చన తదితర పూజలను నిర్వహించి స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయానికి ప్రత్యేకంగా ఆంధ్ర కర్ణాటక తదితర ప్రాంతాల నుండి అశేషంగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన ప్రసాదాలను ఏర్పాటు చేశారు.

# టాటా ఫుట్ బాల్ శిక్షణ కు కర్నూలు క్రీడాకారులు



**కర్నూలు :** గత నెలలో 28 నుండి 30 వరకు జరిగిన ాూూరా ఫుట్బాల్ టోర్నమెంట్లో చక్కటి ప్రతిపను ఘనపరిచి కర్నూలు జిల్లాకు చెందిన జయంత్,రేణుక,రామలక్ష్మి, అండర్ 21 విభాగంలో ముగ్గురు ఫుట్బాల్ క్రీడాకారులు క్రీడాకారులు జంషత్ పూర్ లోని టాటా ఫుట్బాల్ అకాడమీకి అకాడమీలో జరగబోయే 15 రోజులు శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు కర్నూలు జిల్లా ఫుట్బాల్ ప్రెసిడెంట్ ముప్ప రాజశేఖర్ తెలియజేశారు.రాజశేఖర్ మాట్లాడుతూ మన కర్నూలు జిల్లా చెందిన క్రీడాకారులు ఇంతటి చక్కటి ప్రతిభను కనిపరిచినందుకు ఆయన ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు జంషద్పూర్ లో జరగబోయే ఫుట్బాల్ అకాడమీలో చక్కటి ప్రతిభను ఘనపరిచి టాటా ఫుట్ బాల్ కు ప్రాతినిధ్యం వహించాలని ఆయన ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు బీ క్యాంప్ ఫుట్ బాల్ సెక్రటరీ పాల్ విజయ్ కుమార్,లక్ష ఫూట్ బాల్ కోచ్ బ్రహ్మకుమార్ ఫుట్ బాల్ కోచ్ విజయ్ కుమార్ జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు.

వార్త వేకువ
తెలుగు దినపత్రిక · నిజం వైపు నిరంతరం...
సోమవారం 01 - 06 - 2026

# మద్యం అక్రమాలు బయటపడకుండా

## ఫోన్లు ధ్వంసం చేసేసి, పాస్‌వర్డ్‌లు గుర్తులేవంటూ కుట్రలు



సిట్ విచారణలో జగన్ పీఏ కేఎన్ఆర్ బినామీ పుత్తా శివశంకర్‌రెడ్డిని ప్రశ్నించిన సిట్ - ప్రస్తుత ఫోన్ పాస్‌వర్డ్ అడగ్గా మరచిపోయానంటూ బుకాయింపు వైఎస్సార్సీపీ పాలనలో జరిగిన లిక్కర్ స్కాం కేసులో కొల్లగొట్టిన నగదుతో భారీగా స్థిరాస్తుల కొనుగోలు, పెట్టుబడులు పెట్టిన ముఠా వాటి మూలాలపై సిట్ లోతుగా ఆరా తీస్తోందనే తెలిసిన వెంటనే అప్రమత్తమైంది. విచారణను ఎదుర్కోక తప్పదని గ్రహించి ఆధారాలు మాయం చేయటానికి ప్రయత్నించింది. అప్పటివరకూ వాడుతున్న సెల్?ఫోన్లు ధ్వంసం చేసేసి కొత్తవి కొనుగోలు చేసింది. సిట్ విచారణకు హాజరైతే అధికారులు మొబైల్స్ స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపిస్తారని, డేటా వెలికితీసి అక్రమాల గుట్టు బయటపెడతారనే ఉద్దేశంతో ఈ కుట్రకు పాల్పడింది.మద్యం లంచాల డబ్బుతో భారీగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగాలు ఎదుర్కొంటున్న వైఎస్సార్సీపీ అధినేత జగన్ పీఏ కె.నాగేశ్వరరెడ్డి (కేఎన్ఆర్)కి బినామీగా గుర్తించిన ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డిని సిట్ అధికారులు శనివారం ప్రశ్నించారు. ఈ క్రమంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. లిక్కర్ స్కాం కేసులో రెండోరోజూ 8 గంటల పాటు అతడిని సిట్ అధికారులు విచారించారు. మంగళవారం నాడు మరోసారి విచారణకు రావాలని నోటీసులిచ్చారు. శివశంకర్‌రెడ్డి వాడుతున్న మొబైల్స్ ను విచారణలో భాగంగా అన్‌లాక్ చేయాలని సిట్ అధికారులు ఆదేశించారు. వాటిని అన్‌లాక్ చేయటానికి ప్రయత్నిస్తున్నట్లుగా అతడు పలుమార్లు నటించాడు. చివరికి పాస్‌వర్డ్‌లు గుర్తులేవని, మరచిపోయానని చెప్పినట్లు సమాచారం. 'మీ ఫోన్ పాస్‌వర్డ్‌లు మీకే గుర్తు లేకపోవటం ఏమిటి' అని శివశంకర్ రెడ్డిని అడగ్గా నీళ్లు నమిలినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారులు మరింత లోతుగా ప్రశ్నించగా తాను రెండు నెలల కిందట ఫోన్లు కొనుగోలు చేశానని సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది.'అంతకు ముందు వాడిన ఫోన్లు ఏం చేశారు కొత్తవి ఎందుకు కొన్నారు' అని సిట్ అధికారులు శివశంకర్‌రెడ్డిని ప్రశ్నించారు. అందుకు గతంలో వాడిన ఫోన్లను ఈ-వ్యర్థాలుగా మార్చేశానని అతడు జవాబిచ్చారు. బినామీ ఆస్తులు, లావాదేవీల గుట్టు బయటపడకుండా ఉండేందుకు కేఎన్ఆర్ ఆదేశాల మేరకు శివశంకర్‌రెడ్డే ఫోన్లు ధ్వంసం చేశారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడు ప్రస్తుతం వాడుతున్న మొబైల్?ని స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపి విశ్లేషించనున్నారు.శివశంకర్‌రెడ్డి పేరిట కేఎన్ఆర్ జరిపిన ఇతర వ్యవహారాలు, లావాదేవీల కీలక సమాచారాన్ని దగ్గర పెట్టుకుని సిట్ అధికారులు ప్రశ్నించారు. 2019-2024 మధ్య శివశంకర్‌రెడ్డి ఖాతాల్లోకి భారీగా డబ్బు ఎలా వచ్చింది ఆ ట్రాన్సాక్షన్స్‌తో సంబంధం ఏంటి అనే కోణంలో వివరాలు అడిగారు. కె.నాగేశ్వరరెడ్డి (కేఎన్ఆర్)తో తనకు కేవలం పరిచయమే ఉందని అంతకు మించి ఎలాంటి సంబంధాలూ లేవని అతను బుకాయించినట్లు తెలిసింది. మరోవైపు కేఎన్ఆర్ ఆడిటర్‌నూ సిట్ అధికారులు విచారించి కొన్ని వివరాలు రాబట్టారు. వాటి ఆధారంగా సోమవారం కె.నాగేశ్వరరెడ్డిని ప్రశ్నించనున్నారు.విజయవాడ శివారు రామవరప్పాడులోని లక్కీ హ్యుందయ్ షోరూమ్‌లో 51 శాతం వాటా కె.నాగేశ్వరరెడ్డిదేనని దాని యజమాని ఉస్మాన్ సందీప్ సిట్ విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. వైఎస్సార్సీపీ హయాంలో నాలుగున్నర కోట్లు చెల్లించి 51 శాతం వాటా తీసుకున్నారని చెప్పినట్లు తెలుస్తోంది. తాను ఆర్థిక ఇబ్బందుల వల్ల వాటాలు అమ్మేద్దామని చూస్తున్న సందర్భంలో కె.నాగేశ్వరరెడ్డి పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చారని ఉస్మాన్ సందీప్ వివరించినట్లు తెలిసింది.నాలుగున్నర కోట్లకే అంత పెద్ద షోరూమ్‌లో 51 శాతం వాటా ఎలా ఇచ్చేశారు? ఎందుకిచ్చారు? అని అడగ్గా ఉస్మాన్ సందీప్ నీళ్లు నమిలినట్లు తెలుస్తోంది. కె.నాగేశ్వరరెడ్డి నగదును ఎలా చెల్లించారు? ఆ వివరాలివ్వాలని ఉస్మాన్ సందీప్‌ను అడగ్గా ఆయన మౌనం వహించినట్లు తెలిసింది. ఆయా అంశాలపై షోరూమ్ ఆడిటర్‌నూ ప్రశ్నించి కొన్ని వివరాలను రాబట్టారు. వీటన్నింటిని క్రోడీకరించి పెట్టుబడుల వెనక ఉన్న అసలు గుట్టును సిట్ వెలికితీయనుంది.

# విశాఖకు ప్రత్యేక ఆర్ ఆర్ బీ వస్తేనే నోటిఫికేషన్లలో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం

## విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు వెనుక బలమైన కారణాలు

## ఆర్ఆర్‌బీ పరీక్షలు రాసేందుకు వెళ్లినవారిపై ఒడిశాలో గతంలో దాడులు




సొంత ఆర్ఆర్‌బీ కోసం ఎంపీలకు యువత వినతులువిశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటు కావాలన్న ఆకాంక్ష, సుదీర్ఘ పోరాటం వెనుక బలమైన కారణాలున్నాయి. స్థానిక నిరుద్యోగ యువతకు గతంలో జరిగిన అన్యాయాలు దీనికి బలమైన పునాదిరాయి వేశాయి. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు రైల్వే ఉద్యోగాల కోసం ఆర్ ఆర్ బీ పరీక్షలు రాయడానికి ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆ సమయాల్లో వారు ఎదుర్కొన్న అవమానాలు, చేదు అనుభవాలు, వివక్ష ప్రత్యేక జోన్, సొంతంగా రిక్రూట్‌మెంట్ బోర్డు ఉండాలనే డిమాండ్‌ను బలపరిచాయి.విశాఖ రైల్వే జోన్ ఏర్పడింది సరే! ఇక విశాఖకు ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు కావాల్సిన అవసరమేముంది? ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు-ఆర్?ఆర్?బీ పరీక్షలు రాయడానికి పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, కర్ణాటక లేదా తమిళనాడు వెళ్లాల్సి వచ్చేంది. మన ఉత్తరాంధ్ర ప్రాంతం ఒడిశా రాజధాని భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో ఉండేది. అక్కడ పరీక్షలు రాయడానికి వెళ్లే మన విద్యార్థులు అనేక అవమానాలు ఎదుర్కొన్నారు. ఆ ప్రాంతానికి చెందిన కొన్ని వర్గాలు ఏపీ విద్యార్థులపై దాడులు చేయడం, అవమానించడంతో పాటు మా ఉద్యోగాలు మీకెందుకు అంటూ వివక్ష చూపడం వంటి ఘటనలు అనేకం జరిగాయి.విశాఖకు ప్రత్యేక ఆర్ ఆర్ బీ వస్తేనే నోటిఫికేషన్లలో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉద్యోగాల్లో దక్కని ప్రాధాన్యం: అంతేకాకుండా స్థానిక భాషా పరిజ్ఞానం నెపంతోనే లేదా స్థానిక కోటాల వల్లనో ఏపీ విద్యార్థులకు అన్యాయం జరిగేది. సొంతగడ్డపై ఉన్న రైల్వే లైన్ల ద్వారా వచ్చే ఆదాయం ఇతర జోన్లకు తరలివెళ్తున్నా ఈ ప్రాంత నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యం దక్కలేదు. ఈ నేపథ్యంలోనే విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ అధికారికంగా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చిన తర్వాత ఇక్కడ ఒక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు కావడం అత్యంత కీలకంగా మారింది. సొంత రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రాధాన్యమేంటి? కేవలం జోన్‌తో సరిపెట్టకుండా దాని పరిధిలో సొంతంగా నోటిఫికేషన్లు ఇచ్చే ఆర్?ఆర్?బీ కావాలి. విశాఖకు ప్రత్యేక ఆర్?ఆర్?బీ వస్తేనే నోటిఫికేషన్లలో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం దక్కుతుంది. పరీక్షా కేంద్రాలు సైతం ఏపీలోనే ఎక్కువగా ఏర్పాటవుతాయి. అందుకు జోన్ కార్యాలయాల నిర్మాణంతోపాటే, ఆర్ ఆర్ బీ ఏర్పాటుపై ఎంపీలు గట్టిగా పోరాడాలనే డిమాండ్ ఉంది.బోర్డు ఏర్పాటుతో యువతకు ప్రయోజనాలెన్నో: విశాఖ రైల్వేజోన్‌తో పాటు సొంతంగా రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటైతే ఏపీ యువతకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. సొంత రాష్ట్రంలోనే గ్రూప్-సి, గ్రూప్-డి, టెక్నికల్ రైల్వే ఉద్యోగాల నియామకాలు స్థానికంగానే జరుగుతాయి. వేల సంఖ్యలో ఉద్యోగాలు రాష్ట్ర యువతకే దక్కే అవకాశాలు పెరుగుతాయి. పరీక్షలు రాయడానికి ఇతర రాష్ట్రాలకు వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సిన బాధలు తప్పుతాయి. గతంలో ఎదురైన అవమానాలకు శాశ్వతంగా చెక్ పడుతుంది. తెలుగు భాషలో పరీక్షలు రాసుకునేందుకు అవకాశం ఉంటుంది.జోన్ కేంద్ర కార్యాలయం ఏర్పాటు కావడం వల్ల విశాఖ పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు పెరుగుతాయి. దీని వల్ల రవాణా, హోటల్ వంటి ప్రైవేటు రంగాల్లోనూ పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. విశాఖ రైల్వే జోన్ కేవలం ఒక పరిపాలన విభాగం మాత్రమే కాదు. అది ఏపీ నిరుద్యోగ యువత ఆత్మగౌరవం. వారి ఉపాధి హక్కులకు సంబంధించిన అంశం. ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డును సాధిస్తేనే ప్రత్యేక జోన్ సాధనకు సార్థకత ఉంటుంది. యువత ఉద్యోగ స్వప్నాలు సాకారమవుతాయి.

# మానవత్వపు మహోన్నత శిఖరం - అనాథల పాలిట కన్నబిడ్డ ఆర్యవంశీ

## అనాథల అంతిమ సంస్కారాలకు ఆసరాగా నిలుస్తున్న యువకుడు ఆర్యవంశీ

## ఒక పసిప్రాణం విగతజీవిగా మారిన వేళ పుట్టిన సంకల్పం



ఇప్పటి వరకు 400 మృతదేహాలకు అంత్యక్రియలు జననం అందరిదీ ఒకేలా ఉండొచ్చు కానీ, మరణం అందరికీ గౌరవప్రదంగా దక్కదు. కన్నవారే కాదనుకున్న అభాగ్యులు, చనిపోయాక మట్టిలో కలిసేందుకు కూడా దిక్కులేని దుస్థితిలో ఉన్న అనాథలు మన సమాజంలో ఎందరో ఉన్నారు. బంధాలు, అనుబంధాలు మంటగలుస్తున్న ఈ రోజుల్లో నేనున్నాను అంటూ ఓ యువకుడు ముందుకొచ్చాడు. రక్తం పంచుకోకపోయినా, ఏ బంధుత్వం లేకపోయినా కన్న తండ్రిగా, ఆపన్న హస్తమిచ్చే కుమారుడిగా మారి అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నాడు. ఆయనే హైదరాబాద్ ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన మానవతా మూర్తి ఆర్యవంశీ.హృదయాన్ని గాయపరిచిన చిన్నారి మరణం : ఆర్య వంశీది ఒక నిరుపేద కుటుంబం. 2015లో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న తన స్నేహితుడి కుమార్తెకు అత్యవసరంగా ఏబీ నెగిటివ్ రక్తం అవసరమైంది. ఎంత వెతికినా ఆ అరుదైన గ్రూప్ రక్తం దొరక్కపోవడంతో, ఆ పసిప్రాణం కళ్లముందే అనంత వాయువుల్లో కలిసిపోయింది. ఈ ఘోర దుర్ఘటన వంశీ మనస్సును తీవ్రంగా గాయపరిచింది. తోటి వారి ప్రాణాలను కాపాడాలనే పట్టుదలతో స్నేహితులతో కలిసి ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాడు. రక్తదాతలందరినీ ఒకే వేదిక పైకి చేర్చి, వేలాది మందికి సకాలంలో రక్తాన్ని అందించి ప్రాణదాతగా మారాడు.అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆర్యవంశీ లక్ష్యాన్ని మార్చిన ఆ ఒక్క ఫోన్ కాల్ : రక్తదాన శిబిరాల ద్వారా పోలీసులతో ఏర్పడిన పరిచయం వంశీ జీవితాన్ని మరో ఆసక్తికర మలుపు తిప్పింది. ఒకరోజు బేగంపేట పోలీస్ స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్ ఫోన్ చేసి, ఒక గుర్తుతెలియని వృద్ధురాలు చనిపోయిందని, అంత్యక్రియలు చేసేవారు ఎవరూ లేరని చెప్పాడు. ఆ మాట వినగానే వంశీ హృదయం చలించిపోయింది. ఏమాత్రం ఆలోచించకుండా ఆ వృద్ధురాలి అంతిమ యాత్ర బాధ్యతను భుజానికెత్తుకున్నాడు. ఆ క్షణమే ఆయన జీవిత పరమార్థం, ఆశయం పూర్తిగా మారిపోయాయి.కష్టం ఆయనది - మోక్షం అనాథలది : ఇంటర్ వరకు చదివిన వంశీ అనాథల సేవ కోసం పగలు డెలివరీ బాయ్‌గా, రాత్రిపూట క్యాబ్ డ్రైవర్‌గా కష్టపడుతున్నాడు. అలా రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన ప్రతి పైసాను అనాథ మృతదేహాలకు హిందూ సంప్రదాయాల ప్రకారం అంతిమ సంస్కారాలు చేయడానికి ఖర్చు పెడుతున్నాడు. 2015 నుంచి నేటి వరకు సుమారు 400 మందికి పైగా అనాథలకు వంశీ స్వయంగా తలకొరివి పెట్టి మోక్షాన్ని ప్రసాదించాడు. స్వార్థపు చీకట్లు అలముకున్న ప్రస్తుత సమాజంలో, నిస్వార్థ సేవతో మానవత్వపు వెలుగులు విరజిమ్ముతున్న ఆర్య వంశీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం."జీవితమంతా కష్టాలు అనుభవించి, చరమాంకంలో ఎవరూ లేక అనాథలా పడి ఉండే శవాలను చూస్తే మనసు తట్టుకోలేదు. అందుకే వారికి నేనే కుటుంబ సభ్యుడిగా మారుతున్నాను. హైదరాబాద్ నగరంలో ఎక్కడైనా అనాథ మృతదేహం కనిపిస్తే 63003 72886 నంబరుకు సమాచారం ఇవ్వండి. నేను వచ్చి గౌరవప్రదంగా దహన సంస్కారాలు పూర్తి చేస్తాను" -ఆర్య వంశీసమాజంలో ఎవరూ లేనివారికి తానే ఒక సైన్యమై నిలబడిన ఆర్యవంశీ కేవలం మృతదేహాలకు అంత్యక్రియలు చేయడం లేదు, మంటగలిసిపోతున్న మానవత్వాన్ని బతికిస్తున్నాడు. రక్త సంబంధాల కంటే ఆత్మబంధాలే మిన్న అని నిరూపిస్తున్న ఈ కాలపు మంచి మనిషి ఆర్యవంశీ. నిస్వార్థమైన ఆయన సేవకు మనమందరం సెల్యూట్ చేద్దాం. వీలైతే ఆయనకు అండగా నిలుద్దాం.

# గాజువాకలో ఘోర రోడ్డు ప్రమాదం

ఆగివున్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు, ముగ్గురు మృతి

ప్రమాదంలో డ్రైవర్ సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి

ఏడుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు

రాజమహేంద్రవరం నుంచి పార్వతీపురం వెళ్తుండగా ఘటన

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు




ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందిన విషాదకర ఘటన విశాఖ జిల్లా గాజువాకలో ఈ రోజు వేకువజామున జరిగింది. శ్రీనగర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగివున్న లారీని ఏపీఎస్ ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో బస్సు డ్రైవర్‌తో సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం నుంచి 30 మంది ప్రయాణికులతో పార్వతీపురం వెళ్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు ఈరోజు వేకువజామున 4 గంటల సమయంలో గాజువాక శ్రీనగర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని డ్రైవర్ గమనించకపోవడంతో ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది.ఈ ఘటనలో బస్సు డ్రైవర్ రాంబాబు, ప్రయాణికురాలు ఈశ్వరమ్మతో పాటు మరో గుర్తుతెలియని మహిళ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మంత్రాలయంలో విషాదం - తుంగభద్రలో గల్లంతై ఐదుగురు మృతి

## మంత్రాలయం తుంగభద్ర నదిలో శనివారం నాడు గల్లంతైన ఐదుగురు వ్యక్తులు లభ్యమైన మృతదేహాలు



వారంతా బంధుల ఇంట్లో నిర్వహించే శుభకార్యానికి వచ్చారు. బంధువులతో సంతోషంగా ముచ్చటించారు. ఆ తర్వాత బాలుడితో సహా ఐదుగురు వ్యక్తులు తుంగభద్ర నది చూసేందుకు వెళ్లారు. అనంతరం నీటిలోకి దిగారు. ఈ క్రమంలో బాలుడు నీటిలో కొట్టుకుపోతుండగా అతడిని కాపాడేందుకు ప్రయత్నించి మరో నలుగురు గల్లంతయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. ఈ విషాద ఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది.ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మంత్రాలయంలో కాళప్పాచారి ఇంట్లో ఆదివారం వ్రతం ఉండటంతో శనివారం నాడు బంధువులు వచ్చారు. ఇందులో ఆరుగురు వ్యక్తులు తుంగభద్ర నది చూసేందుకు శనివారం సాయంత్రం వెళ్లారు. ఆ తర్వాత నీటిలోకి దిగారు. ఈ క్రమంలో బాలుడు యువన్ చంద్ర(5) నీటిలో కొట్టుకుపోతుండగా అతడిని కాపాడేందుకు ప్రయత్నించి ఒకరి తర్వాత ఒకరు నదిలో గల్లంతయ్యారు. అపర్ణ అనే బాలిక ప్రమాదం నుంచి బయటపడి బంధువులకు సమాచారమిచ్చింది.దీనిపై సమాచారం అందుకున్న మంత్రాలయం సీఐ దస్తగిరి బాబు, అగ్నిమాపక అధికారులు, మత్స్యకారుల సహకారంతో ఘటనా స్థలానికి చేరుకొని నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారు వడ్ల సతీష్(25), రాఘవేంద్ర (25), వడ్ల ధను(22), సంధ్య(21)గా గుర్తించారు. శనివారం సాయంత్రం వడ్ల ధను (22) మృతదేహాన్ని వెలికితీశారు. మిగతా వారికోసం రాత్రి 8:30 గంటల వరకు గాలించినా వారి జాడ దొరకలేదు.ఈ క్రమంలోనే ఇవాళ గాలింపు చర్యలు చేపట్టగా యువన్ చంద్ర, సతీష్ చంద్ర, రాఘవేంద్ర, సంధ్య మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో సతీష్ చంద్ర, యువన్ చంద్ర తండ్రీ కుమారులు కాగా మిగతా వారంతా దగ్గరి బంధువులు. దీంతో శుభకార్యం జరగాల్సిన ఇంట రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై జిల్లా ఇంఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ విచారం వ్యక్తం చేశారు.

# మావోయిస్టులకు పేలుడు పదార్థాల సరఫరా

ఏపీలో ముగ్గురిపై ఎన్ఐఏ చార్జిషీట్

మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముగ్గురిపై ఎన్ఐఏ అభియోగాలు

విశాఖపట్నంలోని ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు

ఇద్దరు ఓవర్ గ్రౌండ్ వర్కర్లు, ఒక అండర్ గ్రౌండ్ మావోయిస్టుపై అభియోగపత్రం

భద్రతా బలగాలపై దాడులే లక్ష్యంగా కుట్ర పన్నారని ఎన్ఐఏ వెల్లడి

ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని తెలిపిన అధికారులు




ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులకు పేలుడు పదార్థాలు, ఇతర వస్తువులు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ముగ్గురు వ్యక్తులపై చార్జిషీట్ దాఖలు చేసింది. శుక్రవారం విశాఖపట్నంలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో ఈ చార్జిషీట్‌ను సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు.నిందితుల్లో నక్కా దేవిడ్ రాజ్ అలియాస్ దేవిడ్, విజయ్ విశ్వాస్‌లను మావోయిస్టు పార్టీ ఓవర్ గ్రౌండ్ వర్కర్లుగా (ఓజీడబ్ల్యూ) గుర్తించారు. వీరు పేలుడు పదార్థాలను అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మావోయిస్టు కేడర్ సోడి కేసకు అందజేస్తుండగా స్థానిక పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులపై ఐపీసీ, పేలుడు పదార్థాల చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద కేసులు నమోదు చేశారు.స్థానిక పోలీసుల నుంచి 2024 సెప్టెంబర్‌లో ఈ కేసును స్వీకరించిన ఎన్ఐఏ, దర్యాప్తులో కీలక విషయాలు కనుగొంది. భద్రతా బలగాలపై దాడులు చేసేందుకు నిందితులు మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సేకరించి, రవాణా చేస్తున్నట్లు తేలింది. దేశ భద్రత, స్థిరత్వానికి భంగం కలిగించేలా ఈ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలను బలోపేతం చేయడమే ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ఎన్ఐఏ తన దర్యాప్తులో పేర్కొంది. ఈ కేసులో మరిన్ని సంబంధాలను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

# పవన్ వల్లే ఉద్యోగం, భూమి,ఆ లాజిక్ ఎలా మిస్ అయ్యారు?

సుగాలి ప్రీతి తల్లికి హైపర్ ఆది సూటి ప్రశ్న

సుగాలి ప్రీతి తల్లి విమర్శలకు హైపర్ ఆది కౌంటర్

పవన్ ప్రశ్నించిన తర్వాతే మీ కుటుంబానికి సాయం అందిందని వెల్లడి

ఓట్ల కోసం పోరాడే వ్యక్తి పవన్ కల్యాణ్ కాదని వ్యాఖ్య

పక్కవాళ్ల మాటలు విని పవన్‌ను నిందించవద్దన్న ఆది

పాలు పోసిన వ్యక్తినే కాటేయడం సరికాదని హితవు



కర్నూలు జిల్లాకు చెందిన సుగాలి ప్రీతి కేసు వ్యవహారం ఏపీ రాజకీయాల్లో మరోసారి దుమారం రేపుతోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సుగాలి ప్రీతి తల్లి చేసిన విమర్శలకు జనసేన నేత, సినీ నటుడు హైపర్ ఆది ఘాటుగా స్పందించారు. పక్కవాళ్ల మాటలు విని, పవన్ కల్యాణ్ లాంటి వ్యక్తిని విమర్శించడం తగదని హితవు పలికారు. సాయం చేసిన వ్యక్తినే నిందించే మనస్తత్వం ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు.ఇటీవల సుగాలి ప్రీతి కుటుంబ సభ్యులు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసి, తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదని, ఓట్ల కోసమే ఈ అంశాన్ని వాడుకున్నారని ప్రీతి తల్లి ఆరోపించారు. ఈ నేపథ్యంలో హైపర్ ఆది ఒక వీడియో ద్వారా స్పందించారు."అమ్మా.. మీరు మీ పాప కోసం పోరాడుతున్నప్పుడు ఏ ప్రభుత్వమైనా స్పందించిందా? పవన్ కల్యాణ్ గారు ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాతే దేశం మొత్తం తెలిసింది. ఆయన ప్రశ్నించిన తర్వాతే భయపడి అప్పటి ప్రభుత్వం మీ భర్తకు ఉద్యోగం, మీకు భూమి ఇచ్చింది. ఈ చిన్న లాజిక్ మీరు ఎలా మిస్ అయ్యారు? పవన్ డిమాండ్ చేయకముందే ప్రభుత్వం ఇచ్చి ఉంటే అది ప్రేమ అనుకోవచ్చు. ఆయన అడిగాక ఇచ్చారంటే అది ఆయనపై ఉన్న భయం అనుకోవాలి" అని ఆది వివరించారు."పవన్ కల్యాణ్ ప్రోద్బలంతోనే కేసు సీబీఐకి వెళ్లింది. ఛార్జిషీట్‌లో పేర్లు మార్చేసి, సీబీఐకే అంతుచిక్కకుండా ఉన్న కేసు గురించి పవన్ ఇంకెంతకాలం పోరాడాలి? తన నెల జీతం కూడా తీసుకోకుండా పిఠాపురంలోని అనాథ పిల్లలకు ఇచ్చే వ్యక్తి, కులమతాలు చూడకుండా రైతులను ఆదుకునే వ్యక్తి ఓట్ల కోసం ఒక అంశాన్ని వాడుకుంటారా? పాలు పోసిన వ్యక్తినే కాటేసే మనస్తత్వం మీకు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. పక్కవాళ్ల మాటలు విని పవన్‌ను విమర్శించడం మానుకోవాలి. పవన్ కాకుండా మీకు ఎవరైనా న్యాయం చేయగలిగితే, నా జీవితంలో జనసేన గురించి మాట్లాడను" అంటూ ఆది సవాల్ విసిరారు. ఈ పరిణామంతో సుగాలి ప్రీతి కేసు మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల



నీలాంబ ఉరివేసుకుని చనిపోయిన మరునాడే.. కళామందిరానికి వచ్చింది లలితాంబ. వెళ్లి దూరంగా కొందరు మహిళా కవయిత్రుల మధ్య కూర్చుంది. ఎక్కడో ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.. విడిపోయాయి. ఇద్దరి మధ్య పూర్తి నిశ్శబ్దం! అదొక నృత్త విన్యాసం.. దాని అర్థం ఆ పరమేష్టికే తెలియాలి!! జీవితం.. కనీసపు శారీరకతృష్ణ కూడా తీరని ఓ ఎండిన మోడుగానే బతుకు ముగిసిపోతుందా!? నీలాంబక్కను తల్పంపై అలా చూసేసరికి ఆరోజు లలితాంబ చేతిని తన గుండెకు తాకించడం తప్పయిందా?.. అప్పటికే తమమధ్య ఆమె కోరుకున్న భోగినీ పండుగ జరిగినట్లు భావించి ఆ సంతోషంలో.. శారీరక బాధల నుంచి విముక్తి కోరుకుని ఉరి వేసుకుందా!? అది కూడా ఖర్మకొద్దీ ఆ రోజునే.. ప్చ్! నీలాంబ మరణం కలిగించిన లోలోన ఘర్షణను మర్చిపోవడానికి అన్నట్లు ఈ పెళ్లిపనులు మీదికెత్తుకున్నాడు జాయచోడుడు. రాత్రింబవళ్లు మరో ఆలోచన రాకుండా అన్నీ తానై నిర్వహిస్తున్నాడు.కాకతీయ సామంత రాజ్యాలన్నీ కూడా గణపాంబ వివాహం తెచ్చిన ఉత్సవ వాతావరణంతో సంబరాలను జరుపుకొంటున్నాయి. సంబరాలతో పులకించిపోతోంది అనుమకొండ మహానగరం. నగరమంతా చలువ తాటాకులతో పెళ్లిపందిరులు వేస్తున్నారు. ఇక కాకతీయకోట, అందులో ఉన్న నియోగాలు, భవనాలు, రాజప్రాసాదాలు, రాజనగరి అన్నిటా సంతోష సందడులే. రాజనగరి మరీమరీ వెలిగిపోతోంది. రాజ్యమంతటా ఆనందసంద్రాలు పొంగి పొరలుతున్నాయి. పెళ్లి బరువు బాధ్యతల నడుమ కాబోయే కాకతీయ వారసులపై ఓ కన్నేసి ఉంచాడు జాయచోడుడు. ముఖ్యంగా పెద్ద మేనల్లుడు రుద్రమదేవుడు, రెండవ మేనల్లుడు మురారిదేవుడు.. వాళ్లిద్దరి కదలికలు, ఉత్సాహ ఉద్వేగాలు.. పెళ్లి సంబరాల్లో వాళ్ల ఆటపాటలు.. అన్నీ పరిశీలిస్తున్నాడు. హరిహరుడు, మురారి విసురునాడులోని గురుకులంలో యుద్ధవిద్యలు అభ్యసిస్తుండగా.. హరిహరుడు కాలధర్మం చెందాడు. మురారి అక్కడే చదువు కొనసాగిస్తున్నాడు. గణపాంబ పూర్తిగా రాజప్రాసాదంలోనే రాజగురువుల వద్ద చదువుకుంటుండగా.. రుద్రమదేవుడు త్రిపురాంతకం గోళకిమఠంలోని విద్యాకేంద్రంలో చదువుతున్నాడు. చదువుతోపాటు యుద్ధవిద్యల్లో కూడా నిష్ణాతుడని విన్నాడు. జాయచోడుని నాజూకు శరీరం రాలేదు గానీ.. అందంలో మేనమామకు తీసిపోడు మురారి. చుట్టూ పదిమంది మిత్రులను వెంటేసుకుని ఎప్పుడూ ఘొల్లుఘొల్లున నవ్వుతూ కేరింతలలో కనిపిస్తున్నాడు మురారి. రుద్రమదేవుడి పక్కన కూడా ఉన్నారు మిత్రులు.. కాదుకాదు అంతా మిత్రురాళ్లు! ఆశ్చర్యపోయాడు. రుద్రమదేవుడు.. గణపతి %-% సోమల దంపతుల ద్వితీయ సంతానం. చూపులకు ఏదో వింత శరీరుడిలా తోచాడు జాయచోడునికి. కాకతీయవంశానికి కాబోయే వారసుడు.. అతని ఆహార్యం వింతగా ఉంది. కంచుకంపై బంగారపు కవచం ధరించాడేమిటి? పరీక్షగా చూస్తే.. అది వక్షస్థలాన్ని నొక్కిపెడుతున్నట్లు! మరింత పరీక్షగా చూస్తే.. చూడకూడని యుక్తవయస్కురాలి యువ సమున్నతాలను దాచడానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా తోచింది. సాధారణంగా యుద్ధవీరులైన మహిళలు అలాంటి కవచాలను ధరిస్తారు. కానీ యువ రారాజు, యుద్ధరంగంలో ఉన్నట్లు అక్క పెళ్లిసంబరాలలో దుస్తులపై కవచం ధరించడం ఏమిటి?! రుద్రమదేవుని జనన సమయంలో రాజ్యంలో చెలరేగిన వాద ప్రతివాదాలు గుర్తొచ్చాయి జాయచోడునికి. చతుష్పథం వద్ద మిత్రుల చర్చలు కళ్లముందు కదలాడాయి. ఇతనికోసమా అప్పట్లో రాజ్యమంతా అట్టుడికిపోయింది?! ఇతనా కాబోయే చక్రవర్తి? ఇతనా పరిణత రాజకీయవేత్త, రణరంగ నిపుణుడు, ఆయన కలలోకి వచ్చినా శత్రువు గుండె ఆగి మరణిస్తాడని కవులు కీర్తించే గణపతిదేవుని వారసుడు? అతణ్ని ఎగాదిగా చూసి జాయచోడుని ఆనందం ఆవిరైపోయింది. అప్పుడే రుద్రమదేవుడు కూడా జాయచోడుణ్ని పరిశీలనగా చూస్తున్నాడు. తననే చూస్తున్న రుద్రమదేవుణ్ని చూసి పలకరింపుగా నవ్వాడు జాయచోడుడు. అతను తిరస్కారంగా చూసి మూతి తిప్పుకొని వెళ్లిపోయాడు.

**దిమ్మెరపోయాడు జాయచోడుడు. వీరయువకుడు అలా మూతి తిప్పడం!??**

అభినయాలు ఎన్నిరకాలో, ప్రతి శరీరభాగ కదలికలు ఎలా ఉండాలో సప్రమాణంగా చెప్పగల మహానాట్యకారుడు జాయచోడుడు విభ్రాంతి చెందాడు. ఆ మూతి తిప్పడం?? ఎటువెళ్లినా.. ఏమి చేస్తున్నా.. ఆ మూతి తిప్పుడు దృశ్యమే మరీమరీ జాయచోడుని కళ్లముందు కదలాడుతోంది. అతనిపై దృష్టిపెట్టాడు జాయచోడుడు. అతడు ఎవ్వరితో కలవడంలేదు. పక్కన ఇద్దరు పరిచారికలు అన్నీ సమకూరుస్తూ అతని వెన్నంటి ఉన్నారు. 'వెన్నంటి ఉన్నారు' అనే కంటే.. ఎవ్వరినీ కలవకుండా కాపలా కాస్తున్నారు అనొచ్చు.వెలనాడు కార్యాలయంలోనే పనిచేస్తూ జాయచోడుడు అనుమకొండ వచ్చిన నాటినుంచి తిరిగి ఆయన ఆంతరంగిక వార్తాహరుడుగా వ్యవహరిస్తున్న వృద్ధుడైన అంకమరట్టని పిలిచి రుద్రమదేవుని కదలికలు పరిశీలించమన్నాడు. మరునాడు అంకమరట్ట చెప్పాడు చెవిలో.. "యువరాజుగారిలో అబ్బాయి కంటే అమ్మాయి లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని యువకులే నవ్వుకుంటున్నారు. పైగా యువరాజుగారు యువకుల చెయ్యి తగిలినా చిరాకు పడిపోతున్నారట మహారాజా! ఇక భుజంపై చెయ్యి వేస్తే యుద్ధమేనట!". చలువపందిళ్లు వేస్తున్నచోట ఉన్నాడు రుద్రమదేవుడు. యువకులంతా కబుర్లు చెప్పుకొంటూ పనిచేస్తుంటే.. అతను మాత్రం ఇద్దరు చెలికత్తెల మధ్య చెంపకు చెయ్యి ఆన్చి విస్ఫారిత నేత్రాలతో చూస్తున్నాడు. చెలికత్తెలు ఏదో చెప్తున్నారు. ముగ్ధ మనోహరంగా అచ్చమైన తెలుగింటి ఆడపిల్లలా నవ్వుతున్నాడు. నవ్వుతున్నప్పుడు ఆ బుగ్గలపై బుజ్జిబుజ్జి చొట్టలు చూడముచ్చటగా కనిపించీ కనిపించకుండా వచ్చి పోతున్నాయి. జాయచోడుని మనసంతా విచారం అలుముకుంది. రుద్రమదేవుడు కేవలం స్త్రీ అయితే ఎంత కన్నులపండువగా ఉంటుంది! తల్లిలా ఛాయ తక్కువైనా.. అందానికి తిరుగులేదు!!

**భగవంతుడా.. బావగారికి ఎంత పెద్ద పరీక్ష పెట్టావయ్యా!!**

ప్చ్.. బావగారితో వీడి గురించి చర్చించాలి అనుకుంటూ గణపాంబ ఉన్న మందిరంలోకి ప్రవేశించాడు. ఎదురుగా గణపాంబను అలంకరిస్తున్నారు సైరంధ్రులు, పుష్పలావికలు. సహకరిస్తూ హాస్యమాడుతున్న మిత్రురాళ్లు, బంధువుల్లోని యువతులు. అదొక యువ యవ్వన కెరటాలు ఎగసిపడుతున్న సంద్రం. ఆ మందిరమంతా విరిసిన నవ్వుల నవ సుమపరిమళంతో పల్లవించి ప్రవహిస్తోంది. 'తను ఆ యవ్వనప్రాయపు సవ్వడులను దాటిపోయాడేమో..' పలకరింపుగా నవ్వి వెనుదిరిగాడు. "మామా.." పిలిచింది గణపాంబ. ఆగి వెనుదిరిగి చూశాడు. గణపాంబ ఆత్మీయంగా పరిగెత్తుకు వచ్చింది. "వీడు.. నా తమ్ముడు. రుద్రమదేవుడు!". "ఆరోజు తండ్రిగారు పరిచయం చేశారుగా పెద్దతల్లి. కానీ, మాట్లాడలేదు" అన్నాడు రుద్రమదేవుణ్ని ఎగాదిగా చూస్తూ. "రుద్రా.. జాయచోడదేవుడు మామ. వినే ఉంటావు. దైవం ప్రసాదించిన మామ. ఎవరికోగానీ, ఇలాంటి మామ దొరుకడు. మహాయోధులు, మహానాట్యకారులు కూడా. అంతేకాదు తండ్రిగారికి అత్యంత నమ్మకస్తులు.." గొప్పగా చెప్పింది గణపాంబ. "విన్నాను. విన్నాను. పిఠాపుర యుద్ధంలో తండ్రిగారికి ఆయుధం అందించిన తీరు తండ్రిగారు ఎప్పుడూ చెబుతుంటారు. త్రిపురాంతకంలో మా యుద్ధగురువులు కూడా మామ ప్రతిభను పాఠాల వేళ ప్రస్తావిస్తుంటారు. ఇప్పుడు దగ్గరగా చూస్తున్నాను" అన్నాడు రుద్రమదేవుడు తిప్పుకొంటూ.అతని గొంతు.. హతవిధీ! ఎంత అన్యాయం చేశాడు దేవుడు. గొంతుకూడా స్త్రీలాలిత్యంతో ఎంత శ్రావ్యంగా ఉంది! రాత్రి ఆంతరంగిక మందిరంలో గణపతిదేవుడితో అన్నాడు జాయచోడుడు. "రుద్రమదేవుడి అంశంలో.. దేవుడు అన్యాయం చేశాడు బావగారు!". పెళ్లి ఏర్పాట్లలో చాలా అలసిపోయినట్లు ముఖం పెట్టాడు గణపతిదేవుడు. "వాడు.. అక్కడే ఇంకా బాగాచదివి ప్రవర్ధిష్ణువు కావాలి. కానీ, అక్కపెళ్లి చూడాల్సిందేనని పట్టుబట్టి మరీ వచ్చాడు. ప్చ్! నిద్ర వస్తోంది జాయా.." అన్నాడు ఆవులిస్తూ. ఆయన ముక్తసరిగా సంభాషణ ముగించి.. 'వెళ్లిపో!' అన్నట్లు మాట్లాడటం ఆశ్చర్యపరచింది. మరునాడు రాజనగరిలో వివాహానికొచ్చిన అతిథులకు నాట్య ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మొదటి ప్రదర్శనే జాయచోడుని నృత్తం. తొలి ప్రదర్శన కావడం.. అదీ జాయచోడుడు నర్తించనుండటంతో రాజనగరి నాట్యమండపం కిక్కిరిసిపోయింది.అందరూ ఆయన నృత్త విన్యాసాన్ని శారీరక కదలికలను విభ్రాంతితో చూస్తున్నారు. సాక్షాత్తూ నటరాజు కైలాసం వీడి అనుమకొండ వచ్చినట్లు.. ఆడుతున్నాడు జాయచోడుడు. కానీ, అతనిలో ఏకాగ్రత లేదు. భావప్రకటన విరుద్ధంగా ఉంది. పాద ముద్రలు తడబడుతున్నాయి. హస్తముద్రలైతే ఘోరం. కానీ, ప్రేక్షకులు ఎప్పటిలాగే విస్మయంతో చప్పట్లు కొట్టి ఆయనను అభినందనలతో ముంచెత్తారు. తీవ్ర విషాదంలో కూరుకుపోయాడు జాయచోడుడు. మొదటిసారి తను నృత్తంలో తప్పటడుగులు వేశాడు. నటుని తాదాత్మ్యత కోల్పోయాడు. విన్యాస విచిత్రాలకు మాత్రమే సాధారణ ప్రేక్షకులు మైమరుస్తారు. కానీ నాట్య ప్రవీణులు చూస్తే ముఖాన ఊస్తారు. పూర్తిగా ఘోరమైన మార్గినృత్తం. దీనికంటే ఓ మారుమూల పల్లెటూరిలో దేశీ ప్రదర్శన ఉత్తమం. తల వంచుకుని రంగమండపం దిగిపోతున్న జాయచోడుడు.. ప్రేక్షకుల్లో ఓ యువతి తనను పరికించి చూడటం గుర్తించాడు. ఎవరీమె? ఎక్కడో చూసినట్లు తెలుస్తోంది. ఎవరీమె.. ఎవరై ఉంటారు?.. ఆమె చేతులు జోడించి అభినందనగా చప్పట్లు చరచి తిరిగి చేతులు జోడించి నమస్కరించి అభినందనగా చూసి మాయమైంది.ఆ పిల్లను చూశాక అతని నృత్త విఫలత తాత్కాలికంగా పక్కకుపోయింది. ఎవరీ పిల్ల?! ఎక్కడ చూశాను అనే ఆలోచన పెరిగిపోయింది. వివాహం క్రతువు పదిరోజులు. ముందువెనకా సంబరాలు మొత్తంగా నెలరోజులు. ఇటు వియ్యాలవారి ఆచార వ్యవహారాలను సమాదరిస్తూ, అటు గణపతిదేవునికి, సోమలదేవికి సహకరిస్తూ శాస్త్రీయ వివాహతంతులలోనూ జాయచోడుడే. యువకులతో చెడుగుడు, యువతులతో పాత్ర గొండ్లి, గుర్రం భంజలి.. అందరినీ కలిపి బిళ్లంగోడు.. అలాగే యువతీ యువకులకు లాస్యనాట్యం, దండరాసకం నేర్పించి, ఆడించి, ఆడి, నాట్యం చేసి నవ్వించి కవ్వించి పెళ్లి వేడుకలను మరపురాని మధుర సంఘటనగా లిఖించాడు. అప్పగింతల వేళ రాజ ప్రాసాదమంతా ఉద్వేగపు కన్నీటిలో

# ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా.. ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు

మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.



**దాహం పెరుగుతుంది**

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

**నోటి దుర్వాసన దీని లక్షణమే..**

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.

**మలబద్ధకం**

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.

**ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...**

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

**ఒంటి నొప్పులు..**

ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీసుకుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

# తిరుమల, విశాఖ ఎర్రమట్టి దిబ్బలకు అంతర్జాతీయ ఖ్యాతి

**యునెస్కో తాత్కాలిక జాబితాలో తిరుమల, ఎర్రమట్టి దిబ్బలు**

**ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా కీలక ముందడుగు**

**భారత్ నుంచి మొత్తం ఏడు ప్రదేశాలకు చోటు**

**జాబితాలో డెక్కన్ ట్రాప్స్, మేఘాలయ గుహలు కూడా**

**ఎక్స్ వేదికగా ప్రకటించిన భారత ప్రతినిధి బృందం**



ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రఖ్యాత సహజ సంపదలకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కే అవకాశం ఏర్పడింది. కలియుగ వైకుంఠంగా పేరుగాంచిన తిరుమల కొండలు, విశాఖపట్నంలోని ఎర్రమట్టి దిబ్బలు యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. ఇది ప్రపంచ వారసత్వ హోదాను సాధించే దిశగా ఒక కీలకమైన ముందడుగు.భారత్ నుంచి మొత్తం ఏడు సహజ వారసత్వ ప్రదేశాలను యునెస్కో తన తాత్కాలిక జాబితాలో చేర్చినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధి బృందం ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈ రెండు ప్రదేశాలు ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందనున్నాయి.ఈ జాబితాలో ఏపీకి చెందిన ప్రదేశాలతో పాటు, మహారాష్ట్రలోని పాంచని-మహాబలేశ్వర్‌లోని డెక్కన్ ట్రాప్స్, కర్ణాటకలోని ఉడుపిలోని సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్, మేఘాలయలోని మేఘాలయన్ ఏజ్ గుహలు ఉన్నాయి. అలాగే, నాగాలాండ్‌లోని నాగా హిల్ ఓఫియోలైట్, కేరళలోని వర్కాల క్లిఫ్ కూడా ఈ జాబితాలో స్థానం దక్కించుకున్నాయని అధికారులు తెలిపారు. తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకోవడం ప్రపంచ వారసత్వ హోదా పొందడంలో మొదటి, కీలకమైన అడుగుగా భావిస్తారు.

రమాయణం

# అమ్మగార్లు.. అయ్యగార్లు

మొదట్లో మా ఇంట్లో వంటకు అయ్యగారు ఉండేవారు. అయితే, మేము మిడిల్ స్కూల్‌కు వచ్చేసరికి అమ్మే వంట చేసేది. ఏరోజూ ఏడెనిమిది మందికి తక్కువ కాకుండా తను వండాల్సి ఉండేది. అయినా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వంటల కోసం అయ్యగార్లు, అమ్మగార్లూ వచ్చేవారు. 'ఆడ ఇక మా నాన్న తన అమ్మమ్మకూ, తాతయ్యకూ దత్తపుత్రుడు కనుక వాళ్లిద్దరికీ తద్దినాలు పెట్టేవాడు. అది చాలా ఖర్చు, శ్రమతో కూడిందైనా, నాన్న తన ఎనభై మూడో ఏట చనిపోయేదాకా.. సుమారు తన పద్నాలుగో ఏట నుంచీ.. అంటే డబ్భై ఏళ్లపాటు ఎంతో శ్రద్ధగా ఆబ్దికాలు పెట్టేవాడు. "ఎందుకు నానా ఈ తద్దినం పెట్టడం?!" అని ఓసారి అడిగాను. దానికి నాన్న ఎంతో ఓపిగ్గా.. "మనం రోజూ అన్నం తింటం గద! మరి పై లోకానికి పోయినోళ్లకు ఎవరు పెడతరు?! మనకు ఒక సంవత్సరం అయితె వాండ్లకు ఒకరోజు అన్నట్టు. అందుకోసం వాండ్లకు ఏడాదికొక్కసారి పిండాలు పెట్టాలె. దాన్ని కాకులకో, పక్షులకో పెడుతం. వాండ్లు పక్షుల రూపంల ఒచ్చి తినిపోతరని, అట్ల వాండ్ల దీవెనలు ఉంటయని పెద్దవాండ్ల నమ్మకం!" అని చెప్పాడు. అట్లాగే ఇంకోమాట కూడా చెప్పాడు.. "పెద్దవాండ్ల విశ్వాసం కోసం అది చెయ్యాలె. ఆ పేరుతోటి ఆరోజు ఒక పదిమంది ఆకలితోటి ఉన్నవాండ్లకు భోజనం పెడితే బాగుంటదని నాకనిపిస్తది".. ఆ మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. వారం ముందే ఓ జీతగాడిని వెంటపెట్టుకుని వెళ్లి కిరాణా సామాను తెచ్చేవాడు నాన్న. అప్పుడే కాదు.. నాన్న ఎప్పుడు ఇంట్లోకి సామాను తెచ్చినా నాకూ, అక్కకూ చెరో బిస్కట్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చేవాడు. మేము వాటికోసమే ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవాళ్లం. అదే మాకు చాలా గొప్ప ఔట్ సైడ్ ఫుడ్. అదికూడా తరచుగా ఉండేది కాదు. ఏదైనా ఇంట్లో చేసింది తినడమే! తద్దినం రోజు ఏడింటికల్లా మా పక్కఊరు చాగల్లు నుంచి సింహయ్యగారు, ఆయన కొడుకు కేశవయ్యగారు వచ్చేవారు. ఆరోజు వీలైనంత వరకూ నేను బడి ఎగ్గొట్టడం తప్పనిసరి అని వేరే చెప్పక్కర్లేదుగా! వాళ్లు వస్తూనే మడిపంచెలు కట్టుకుని వంటింట్లో దూరేవారు. అమ్మకు ఒక్క వంట తప్పేది కానీ, మిగతా అన్ని పనులూ పెరిగేవి. ఓ పది రకాల వంటకాల కోసం బోలెడు కూరగాయలు కోసి, మిగతా వంట సామానంతా సిద్ధం చేసి ఉంచేది. వాళ్లు పిలిస్తే చాలు.. "ఏం గావాలె అయ్యగారూ!" అంటూ సిద్ధంగా ఉండేది. దగ్గరి మూడు కుటుంబాల బంధువులు భోజనాలకు వచ్చేవారు. ఇంకా పదిమంది దాకా పనివాళ్లకు, ఆరోజున ఎందరొస్తే అందరు బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టడం అమ్మవంతే అయ్యేది. మేము కాస్త పెద్దయిం తరువాత వడ్డనలు చేసేవాళ్లం. అప్పుడు గ్రైండర్లు, మిక్సర్లు లేవు గనుక.. అయ్యగార్లు పెద్దరోటి ముందు కూచుని పప్పు రుబ్బేవారు. వాళ్లు చేసే గారెలు భలే రుచిగా ఉండేవి. మమ్మల్ని వంట చేసేటప్పుడు ఆ దరిదాపులక్కూడా రానిచ్చేవారు కాదు. మాకేమో మగవాళ్లు ఎలా వండుతారో చూద్దామని కుతూహలం. "ఇటు దిక్కు రావొద్దు.. మడి!" అనేవారు. ఇంకొక బ్యాచ్ బ్రాహ్మలు వచ్చి ఏవో మంత్రాలు చదివి నాన్నచేత తద్దినం పెట్టించేవారు. తరువాత అందరం వరుసగా కింద చిన్న చాపల మీద కూచొని.. ముందు విస్తర్లు పరుచుకుని ఉంటే, వాళ్లే వడ్డన చేసేవారు. సింహయ్య గారు అప్పటికే చాలా పెద్దాయన. ఆయనకు వంగడం వచ్చేది కాదు. అన్నిటినీ నిలబడే అంతెత్తునుంచి తపుక్కున విస్తట్లో వేసేవాడు. అయినా మేము భయంతో ఏమీ అనేవాళ్లం కాదు. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కేశవయ్యగారు కూడా వచ్చేవాడు. నాన్న చనిపోయాక ఇక మా పుట్టింట్లో తద్దినాలు పెట్టడం ఆగిపోయింది. కొన్నాళ్లకు కేశవయ్యగారు మంచాన పడ్డాడని తెలిసి వెళ్లి చూసొచ్చాను. ఆయన పోయినా ఇప్పటికీ ఆ కుటుంబంతో



టచ్‌లోనే ఉన్నాం. మా చిన్నప్పుడు కూనూరు నుంచి లక్ష్మయ్యగారు, వాళ్లన్నయ్య మత్స్యయ్యగారు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. "గీ మత్స్యయ్య ఏం పేరు? గీయిన మనిషే గద.. చేప పేరు పెట్టుకున్నడేంది?!" అని అమ్మను అడిగాను. "నీకు కోతి మాటలు బాగ ఎక్కువయినయ్! శ్రీ మహావిష్ణువు దశావతారాలల్ల మొదటిది ఏంది?!" అన్నది అమ్మ. నాకు ఠక్కున గుర్తొచ్చింది. "తిరుపతి, యాదగిరి, సింహాచలం.. అని దేవుని గుళ్లుండే ఊరి పేర్లు పెట్టుకున్నట్టే.. మత్స్యగిరి, వరాహగిరి, కూర్మనాథం అని కూడా పెట్టుకుంటరు" అన్నది అమ్మ. అప్పుడర్థమైంది. ఇంతకూ ఈ మత్స్యయ్యగారి గురించి చెప్పొచ్చేదేంటంటే.. ఈయన ఎప్పుడూ మా అక్కాచెల్లెల్లిద్దరి మధ్యలో ఏదోఒక గొడవో, పోటీనో పెట్టి తమాషా చూద్దామనుకునేవాడు. మేమేం తక్కువా?! ఆదర్శ అక్కాచెల్లెళ్లం మరి! మాకు పెద్దగా కొట్లాటలే వచ్చేవి కావు. ఆయన మా పుట్టినరోజులు గుర్తు పెట్టుకుని ఒకరోజు ముందుగానే వచ్చేవాడు. పుట్టినరోజంటే పెద్దగా కేక్ కట్‌చేయడం, స్నేహితుల్ని పిలవడం, సెలెబ్రేట్ చేయడం లాంటివి మాకు తెలియదు. ఆరోజు తలంటు పోసుకోవడం, ఉన్నంతలో కొత్త బట్టలు వేసుకోవడం చేసేవాళ్లం. అమ్మ ఏదైనా స్వీట్ చేసేది. ఈ మత్స్యయ్యగారు రాగానే.. "పోయినేడు మీ చెల్లె పుట్టినరోజుకు లడ్డూలు చేయించింది అమ్మ. మరి నీ పుట్టిన్రోజుకు ఏం చెయ్యాలె చెప్పు?! మీ అమ్మను అడుగు" అంటూ అక్కను రెచ్చగొట్టేవాడు. ఇక అక్క లడ్డూలు చేయించమని అమ్మ వెంటపడేది. ఆ తరువాత వచ్చే నా పుట్టినరోజు కూడా అంతే! "మీ అక్క పుట్టినరోజుకు లడ్డూలు చేసిన్రు. నీకు గూడ గవ్వే అయితె ఏం బావుంటది?! మంచిగ మైసూర్ పాక్ చేయించుకో.. అమ్మ తోటి చెప్పుపో!" అనేవాడు. "ఏం జెయ్యాల్నో అమ్మకు తెల్సు" అనేదాన్ని నేను. ఈయన కథ ఇలా ఉంటే.. అప్పుడప్పుడూ మా ఇంటికి కూనూరు నుంచి అండమ్మగారూ, లక్ష్మయ్యగారూ వచ్చేవారు. వాళ్ల ముచ్చట్ల గురించి వచ్చేవారం చెప్పుకొందాం!

# పగలు నిద్ర.. రాత్రి కొలువు!

**ఇండియా నుండి యూఎస్ షిఫ్టుల్లో పనిచేయడం వల్ల కలిగే 5 లాభ నష్టాలు ఇవే!**

భారతదేశంలో ఐటీ , బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ రంగాలలో పనిచేసే లక్షలాది మంది ఉద్యోగులకు 'నైట్ షిఫ్టులు' లేదా 'యూఎస్ షిఫ్టులు' చేయడం అనేది ఒక నిత్యకృత్యం. అమెరికా టైమింగ్స్‌కు అనుగుణంగా ఇక్కడ రాత్రి పూట పనిచేయడం వల్ల చేతినిండా డబ్బులు వస్తున్నా.. లైఫ్ స్టైల్ మాత్రం పూర్తిగా మారిపోతుంది. తాజాగా పూణేకు చెందిన సాయక్ రాయ్ అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్.. ఇండియాలో ఉంటూ యూఎస్ షిఫ్టుల్లో (యశీఎం) చేయడం వల్ల కలిగే 5 ప్రధాన లాభ నష్టాలను వివరిస్తూ పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతోంది. రాత్రి 7:30 గంటల నుండి తెల్లవారుజామున 4:30 గంటల వరకు పనిచేసిన తన వ్యక్తిగత అనుభవాన్ని ఆయన నెటిజన్లతో పంచుకున్నారు. యూఎస్ షిఫ్ట్ వల్ల కలిగే 5 అద్భుతమైన లాభాలు.. భారీ జీతాలు నైట్ అలవెన్సులు: సాధారణ డే షిఫ్ట్ ఉద్యోగులతో పోలిస్తే యూఎస్ షిఫ్టుల్లో పనిచేసే వారికి కంపెనీలు భారీ ప్యాకేజీలతో పాటు అదనంగా 'నైట్ షిఫ్ట్ అలవెన్స్'లను ఇస్తాయి. దీనివల్ల ఆర్థికంగా మంచి బెనిఫిట్స్ ఉంటాయి. ప్రశాంతమైన వర్క్ కల్చర్: సాయక్ రాయ్ అభిప్రాయం ప్రకారం.. యూఎస్ క్లయింట్లతో పనిచేసేటప్పుడు వర్క్ కల్చర్ చాలా బాగుంటుంది. ఆఫీస్ టైమింగ్స్ ముగిసిన తర్వాత నిమ్మదిగా లాగాఫ్ చేయవచ్చు, మేనేజర్లు కూడా అదనపు పని కోసం ఒత్తిడి చేయరు. అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ కమ్యూనికేషన్: గ్లోబల్ క్లయింట్లతో నిరంతరం మాట్లాడటం వల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ (ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యం) విపరీతంగా మెరుగవుతాయి. అంతర్జాతీయ మార్కెట్ ఎలా పనిచేస్తుందో దగ్గర నుండి చూడవచ్చు. పగటిపూట ఖాళీ సమయం: రాత్రి పూట డ్యూటీ చేయడం వల్ల పగటిపూట బ్యాంకు పనులు, షాపింగ్ లేదా వ్యక్తిగత పనులను ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేసుకోవచ్చు. 'మండే బ్లూస్' ఉండవు: సాధారణంగా ఐటీ ఉద్యోగులకు ఆదివారం రాత్రి కాగానే సోమవారం ఆఫీస్ టెన్షన్ మొదలవుతుంది. కానీ యూఎస్ షిఫ్ట్ వాళ్లకు సోమవారం సాయంత్రం వరకు ఆఫీస్ స్టార్ట్ కాదు కాబట్టి వీరు వీకెండ్‌ను కాస్త ఎక్కువ ఎంజాయ్ చేయవచ్చు. అదే షిఫ్ట్ వల్ల వచ్చే 5 భయంకరమైన



నష్టాలు .. నిద్ర లేమి సమస్యలు : నైట్ షిఫ్ట్ ఉద్యోగుల అతిపెద్ద సవాలు ఇక్కడే వస్తుంది. వారు పగటిపూట పడుకోవాలని చూసినా.. బయట సమాజం, ఇరుగుపొరుగు ఇళ్లలో అరుపులు, శబ్దాల వల్ల ప్రశాంతమైన నిద్ర కరువవుతుంది. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు: రాత్రి వేళల్లో మేల్కొని ఉండటం వల్ల జీర్ణక్రియ దెబ్బతింటుంది, ఊబకాయం (ాఎవంఈఎ), గ్యాస్ సమస్యలు , గుండె జబ్బుల రిస్క్ పెరుగుతుంది. సోషల్ లైఫ్ దూరం: స్నేహితులు, బంధువులు అందరూ పగలు ఖాళీగా ఉంటే.. వీరు రాత్రి ఖాళీగా ఉంటారు. దీనివల్ల పెళ్లిళ్లు, ఫంక్షన్లు, వీకెండ్ పార్టీలకు వెళ్లడం కుదరక బంధాలు బలహీనపడే ప్రమాదం ఉంది. మానసిక ఒత్తిడి ఢ యాంగ్జైటీ: నిద్ర సరిగ్గా లేకపోవడం, ఎప్పుడూ ఒంటరిగా గడపడం వల్ల మూడ్ స్వింగ్స్ (వీశీశీస ాఞఅస్త్రం), నిరాశ , యాంగ్జైటీ (ఆందోళన) లాంటి మానసిక సమస్యలు వస్తాయి. తక్కువ ఎనర్జీ లెవెల్స్ ఢ కంటి సమస్యలు: రాత్రంతా లాప్‌టాప్ స్క్రీన్ల వైపు చూడటం వల్ల కళ్లు అలసిపోతాయి. పగటిపూట ఎండ తగలకపోవడం వల్ల విటమిన్-డి లోపించి, శరీరంలో ఎనర్జీ లెవెల్స్ బాగా తగ్గిపోతాయి. నెటిజన్లు ఏమంటున్నారంటే? సాయక్ రాయ్ షేర్ చేసిన ఈ పోస్ట్‌పై నెటిజన్లు, ముఖ్యంగా నైట్ షిఫ్ట్ ఐటీ ఉద్యోగులు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. "కొన్నేళ్లుగా నేను ఇదే లైఫ్ లీడ్ చేస్తున్నాను, ఈ లిస్ట్ 100% కరెక్ట్" అని ఒకరు రాయగా.. "ఈ నైట్ షిఫ్ట్ జాబ్స్ అందరికీ సెట్ కావు, ఎవరైతే రాత్రి పూట ఎక్కువ ప్రొడక్టివ్‌గా ఉంటూ ప్రశాంతతను కోరుకుంటారో వారికి మాత్రమే ఇవి బెస్ట్" అని మరికొందరు అభిప్రాయపడ్డారు. అయితే కొందరు నెటిజన్లు మాత్రం పాజిటివ్‌గా స్పందిస్తూ.. నైట్ షిఫ్ట్ వల్ల తాము డే టైమ్‌లో జిమ్‌కు వెళ్లడానికి, మంచి ఫిట్‌నెస్ సాధించడానికి టైమ్ దొరుకుతుందని కామెంట్ చేశారు. ఏదేమైనా.. రూపాయి సంపాదించాలంటే ఒక వైపు లైఫ్ స్టైల్‌ను త్యాగం చేయక తప్పదని ఈ స్టోరీ నిరూపిస్తోంది!

# మళ్లీ మొదలయ్యే యుద్ధంపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన





ఇరాన్ పంపిన 14 సూత్రాల శాంతి ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అందిన ఈ ప్రతిపాదనలో సంఘర్షణ నివారణ, హార్ముజ్ జలసంధి నిర్వహణ వంటి అంశాలు ఉన్నప్పటికీ, ఇరాన్ గత దశాబ్దాలుగా చేసిన పనులకు తగిన మూల్యం చెల్లించలేదని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదన ఆమోదయోగ్యం కాకపోవచ్చని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా సూచనప్రాయంగా తెలిపారు. ఒకవేళ ఇరాన్ ఏదైనా దుందుడుకు చర్యకు పాల్పడితే.. ఆ దేశంపై కఠినమైన సైనిక చర్య తీసుకునే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఫిబ్రవరిలో ప్రారంభమైన యుద్ధం ఏప్రిల్ నుండి కొంత విరామం తీసుకున్నప్పటికీ, ఇప్పుడు ఇరాన్ సైనిక అధికారులు మళ్ళీ ఘర్షణలు మొదలయ్యే అవకాశం ఉందని చెబుతుండటం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. అదే సమయంలో అటు ఇరాన్ లోపల ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైంది. చమురు ఎగుమతులు నిలిచిపోవడం, అమెరికా ఆంక్షల వల్ల ద్రవ్యోల్బణం 50 శాతానికి పైగా పెరిగింది. ప్రజలు తమ వద్ద ఉన్న బంగారం, డాలర్ల వంటి పొదుపులతో ప్రస్తుతానికి నెట్టుకొస్తున్నా, అవి అయిపోయిన తర్వాత దేశం ఆర్థికంగా కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హార్ముజ్ జలసంధిపై పట్టు బిగించడం ద్వారా ప్రపంచ మార్కెట్‌లోకి వచ్చే చమురు సరఫరాను ఇరాన్ అడ్డుకుంటోంది, దీనివల్ల చమురు ధరలు యుద్ధానికి ముందు కంటే 50 శాతం అదనంగా పెరిగాయి. ఈ జలమార్గం గుండా వెళ్లే నౌకల నుండి టోల్ వసూలు చేసి, ఆ నిధులను సైనిక మౌలిక సదుపాయాల కోసం వాడాలని ఇరాన్ పార్లమెంట్ భావిస్తోంది. మళ్లీ క్యూబాపై యుద్ధాన్ని ప్రకటించిన ట్రంప్.. ఇరాన్ యుద్ధం ముగియక ముందే ప్రపంచానికి మరో ఆందోళన.. మరోవైపు లెబనాన్ సరిహద్దుల్లో ఇజ్రాయెల్- హిజ్బుల్లా మధ్య దాడులు ఆగడం లేదు. కాల్పుల విరమణ ప్రయత్నాలు జరుగుతున్నా, ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్ లోని గ్రామాలను ఖాళీ చేయమని హెచ్చరిస్తూ వైమానిక దాడులను కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో మతపరమైన భవనాలు, కాన్వెంట్లు కూడా దెబ్బతింటున్నాయని స్వచ్ఛంద సంస్థలు పేర్కొంటున్నాయి. అటు వాషింగ్టన్‌లో కూడా ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై రాజకీయంగా చర్చ జరుగుతోంది. యుద్ధం కోసం కాంగ్రెస్ ఆమోదం తీసుకోవడంలో ట్రంప్ జాప్యం చేస్తున్నారని ప్రతిపక్ష డెమోక్రాట్లు విమర్శిస్తున్నారు. ఈ విధంగా అటు యుద్ధ క్షేత్రంలోనూ, ఇటు దౌత్య మరియు ఆర్థిక రంగాలలోనూ అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. కాగా సంఘర్షణను ముగించేందుకు ముందుకు తెచ్చిన 9 పాయింట్ల ప్రతిపాదనలకు ప్రతిస్పందనగా 14 పాయింట్లతో కొత్త శాంతి ప్రణాళికను సమర్పించింది. ఈ ప్రతిపాదనలో, ావఖ్రఅశీఅ సహా మొత్తం ప్రాంతంలో యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేయాలని టెహ్రాన్ స్పష్టం చేసింది. అమెరికా సూచించిన తాత్కాలిక కాల్పుల విరమణను ఇరాన్ తిరస్కరించింది. దాని బదులుగా, 30 రోజుల్లోపే శాశ్వతంగా యుద్ధం ముగిసేలా సమగ్ర ఒప్పందం కావాలని డిమాండ్ చేసింది. అలాగే భవిష్యత్తులో తమపై ఎలాంటి దాడులు జరగకుండా స్పష్టమైన భద్రతా హామీలు ఇవ్వాలని కోరింది. ఇదే సమయంలో, సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న అమెరికా బలగాలను ఉపసంహరించుకోవాలని కూడా ఇరాన్ డిమాండ్ చేసింది. విదేశాల్లో నిలిపివేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని, తమపై విధించిన ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలని ప్రతిపాదనల్లో పేర్కొంది. యుద్ధం వల్ల కలిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని కూడా ఇరాన్ తన ప్రతిపాదనలో స్పష్టం చేసింది.

## కాగ్నిజెంట్ సంచలన నిర్ణయం 4,000 మందిపై వేటు

**20,000 మందికి బంపర్ ఆఫర్!**




ప్రముఖ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ తన ఉద్యోగుల వ్యవస్థలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. సుమారు 3,500 నుంచి 4,000 మంది మిడ్-లెవల్ ఉద్యోగులపై వేటు వేస్తూనే, మరోవైపు భారత్‌లో 20,000 మంది ఫ్రెషర్లను నియమించుకోవాలని ప్లాన్ చేస్తోంది. భారత ఐటీ రంగంలో వస్తున్న పెను మార్పులకు ఇది నిదర్శనం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్కీలు తక్షణమే సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. తక్కువ ఖర్చుతో కూడిన యువ శక్తిని పెంచుకోవడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు ఉద్దేశం. ఖర్చులను తగ్గించుకుంటూ, వేగంగా వృద్ధి చెందుతున్న డిజిటల్ విభాగాలపై దృష్టి సారించాలని కంపెనీ భావిస్తోంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి మధ్య లాభాలను పెంచుకోవడానికి ఈ పునర్వ్యవస్థీకరణ దోహదపడుతుంది. ఈ కీలక మార్పులన్నింటికీ భారత్ ప్రధాన కేంద్రంగా ఉంది. తమ కెరీర్ భద్రతపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కాగ్నిజెంట్ తీసుకున్న ఈ నిర్ణయాలు ఇతర ఐటీ కంపెనీల నియామక ప్రక్రియలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. కాగ్నిజెంట్ లేఆఫ్స్.. ఫ్రెషర్ల నియామక వ్యూహం ఇదే! ప్రస్తుతం కంపెనీలో జరుగుతున్న మార్పుల వల్ల మిడ్-లెవల్ మేనేజర్లపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా చాలా ఉద్యోగాలు ఆటోమేట్ అవుతున్నాయి లేదా వాటి అవసరం లేకుండా పోతోంది. ఇది కేవలం కాగ్నిజెంట్‌కే పరిమితం కాలేదు, మొత్తం ఐటీ రంగాన్నే కుదిపేస్తోంది. గ్లోబల్ మార్కెట్‌లో పోటీని తట్టుకోవాలంటే ఇలాంటి వ్యూహాత్మక మార్పులు తప్పవని కంపెనీ భావిస్తోంది. దీనివల్ల జనరేటివ్ ఏఐ వంటి భవిష్యత్ టెక్నాలజీలపై పెట్టుబడి పెట్టే అవకాశం లభిస్తుంది. 20,000 మంది ఫ్రెషర్లను తీసుకోవాలనే నిర్ణయం యువ ప్రతిభకు పెద్దపీట వేస్తోంది. అనుభవజ్ఞులైన వారితో పోలిస్తే ఫ్రెషర్ల వల్ల కంపెనీకి ఖర్చు తగ్గుతుంది. పనితీరును మెరుగుపరుస్తూనే ఖర్చులను నియంత్రించడానికి ఈ 'టాలెంట్ పిరమిడ్' పద్ధతి ఉపయోగపడుతుంది. త్వరలోనే భారత్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పుంజుకునే అవకాశం ఉంది. గ్రాడ్యుయేట్లు ఇప్పటికే ఈ అవకాశాల కోసం సిద్ధమవుతున్నారు. ాశీషవతీవస దీఎ భారత ఐటీ ఉద్యోగాలు, జీతాల పెంపుపై ప్రభావం భారత ఐటీ హబ్‌లలో లాటరల్ హైరింగ్ (అనుభవజ్ఞుల నియామకం) గణనీయంగా తగ్గుతోంది. కంపెనీలు కొత్త ప్రాజెక్టుల కోసం అంతర్గత ప్రతిభను, ఫ్రెషర్లను ఎక్కువగా నమ్ముకుంటున్నాయి. ఈ మార్పు వల్ల ప్రస్తుత ఉద్యోగుల జీతాల పెంపు, వేరియబుల్ పేపై ప్రభావం పడవచ్చు. బెంచ్ పీరియడ్‌లో ఉన్న వారి సంఖ్యను తగ్గించేందుకు కంపెనీలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. ఈ క్లిష్ట సమయంలో ఉద్యోగం కాపాడుకోవాలంటే మెరుగైన పనితీరు కనబరచడం తప్పనిసరి. ప్రస్తుత ఐటీ రంగంలో ఎంట్రీ లెవల్, మిడ్-లెవల్ ఉద్యోగాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. కాగ్నిజెంట్ ప్రాధాన్యతలు ఎలా మారుతున్నాయో కింది డేటా ద్వారా తెలుసుకోవచ్చు. భవిష్యత్ వృద్ధి కోసం సంస్థను మరింత పటిష్టంగా మార్చడమే ఈ వ్యూహం లక్ష్యం. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నవారు ఈ గణాంకాలను గమనించడం చాలా ముఖ్యం. ఉద్యోగుల విభాగం ప్రణాళిక ప్రధాన లక్ష్యం మిడ్-లెవల్ ఉద్యోగాలు 4,000 ఉద్యోగాల తొలగింపు లాభాల పెంపు (మార్జిన్ ఇంప్రూవ్‌మెంట్) ఫ్రెషర్లు 20,000 మంది నియామకం పిరమిడ్ ఆప్టిమైజేషన్ ప్రధాన కేంద్రం ఇండియన్ సర్వీస్ హబ్స్ ఖర్చుల నియంత్రణ ఈ మార్పులకు ప్రధాన కారణం ఏఐ ఆధారిత ఆటోమేషన్. జనరేటివ్ ఏఐ రంగంలో ముందంజలో ఉండటానికి కాగ్నిజెంట్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. పనులు ఆటోమేట్ అవుతుండటంతో, పాత పద్ధతుల్లో చేసే ఉద్యోగాల అవసరం తగ్గుతోంది. ఈ టెక్నాలజీ విప్లవం ఐటీ కంపెనీల పనితీరును మార్చేస్తోంది. మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే ఉద్యోగులు ఏఐ టూల్స్‌ను వాడటం నేర్చుకోవాలి. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ఇతర ఐటీ దిగ్గజాలు కూడా ఈ ట్రెండ్‌ను గమనిస్తున్నాయి. కేవలం ఉద్యోగుల సంఖ్యను పెంచుకుంటూ పోవడం కంటే, ప్రతి ఉద్యోగి ఉత్పాదకత పెంచడంపైనే కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఐటీ రంగంలో పోటీ ఇలాగే ఉండబోతోంది. పాత నియామక పద్ధతుల స్థానంలో నైపుణ్యం ఆధారిత నియామకాలు వస్తున్నాయి. భారత ఐటీ ఉద్యోగాల భవిష్యత్తు.. బెంచ్ మేనేజ్‌మెంట్ వేరియబుల్ పే విషయంలో టెక్కీల్లో ఆందోళన నెలకొంది. టెక్నాలజీపై పెట్టుబడుల కోసం తమ ప్రయోజనాలను తగ్గిస్తారేమోనని చాలామంది భయపడుతున్నారు. అయితే, దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ఈ మార్పులు తప్పవని కంపెనీ అంటోంది. బెంచ్ మేనేజ్‌మెంట్ ఇప్పుడు సీనియర్ లీడర్లకు సవాలుగా మారింది. ఖాళీగా ఉండే సమయాన్ని తగ్గించడం ద్వారా సంస్థ ఆర్థిక స్థితిని మెరుగుపరచాలని చూస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉద్యోగులు కొత్త టెక్నాలజీల్లో నైపుణ్యం పెంచుకోవాలని కంపెనీ సూచిస్తోంది. ఈ గడ్డు కాలాన్ని అధిగమించాలంటే అప్‌స్కిల్లింగ్ ఒక్కటే మార్గం. ఏఐ టూల్స్‌పై పట్టు సాధించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. ఇప్పుడు జాబ్ మార్కెట్ చాలా సెలెక్టివ్‌గా మారింది. నిరంతరం నేర్చుకోవడం అనేది ఇప్పుడు ఆప్షన్ కాదు, కెరీర్‌లో ఎదగడానికి అది ఒక అవసరం. భారత ఐటీ రంగంలో వస్తున్న మార్పులు పనితీరును మెరుగుపరిచే దిశగా సాగుతున్నాయి. కాగ్నిజెంట్ ప్లాన్ ఒకవైపు నాయకత్వ స్థాయిలో మార్పులు చేస్తూనే, మరోవైపు ఫ్రెషర్లకు భారీగా అవకాశాలు కల్పిస్తోంది. మిడ్-లెవల్ ఉద్యోగులకు ఇది కష్టకాలమే అయినా, ఫ్రెషర్లకు మాత్రం ఇది ఒక మంచి అవకాశం. మారుతున్న కాలానికి అనుగుణంగా మారడమే విజయానికి సూత్రం. ఐటీ రంగం ఇప్పుడు సరికొత్త ఆవిష్కరణలు, పొదుపు మంత్రంతో ముందుకు సాగుతోంది.

# సొంతింటి కల ఇక భారమేనా


**తెలంగాణలో భారీగా పెరగనున్న ఆస్తుల రిజిస్ట్రేషన్ ధరలు!**




తెలంగాణ ప్రభుత్వం ఈ వారం నుంచే ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలను పెంచేందుకు సిద్ధమైంది. ఈ నిర్ణయం హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో ఇళ్లు కొనేవారిపై భారీ ప్రభావం చూపనుంది. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల లెక్కింపునకు మార్కెట్ విలువే ప్రాతిపదిక కావడంతో, ఇకపై ఆస్తుల కొనుగోలు ఖర్చు గణనీయంగా పెరగనుంది. నివాస, వాణిజ్య, వ్యవసాయ భూములకు సంబంధించి కొత్త ధరల పట్టికను అధికారులు ఇప్పటికే ఖరారు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ప్రైమ్ ఏరియాల్లో ప్రభుత్వ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని సమాచారం. గత కొన్నేళ్లుగా నగరంలో రియల్ ఎస్టేట్ రంగం శరవేగంగా వృద్ధి చెందడమే ఈ మార్పునకు ప్రధాన కారణం. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో మార్కెట్ ధరలు ప్రభుత్వ ధరల కంటే ఎంతో ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్: పెరగనున్న మార్కెట్ విలువలుసాధారణంగా మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వ రేట్లను సవరించడం సహజం. దీనివల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెరిగి, రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాలకు నిధులు సమకూరుతాయి. అయితే, సొంతింటి కల కంటున్న మధ్యతరగతి ప్రజలపై ఇది నేరుగా ఆర్థిక భారాన్ని మోపుతుంది. ఆస్తి విలువ ఆధారంగానే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులను శాతాల్లో లెక్కిస్తారు. మార్కెట్ విలువ కేవలం ఐదు శాతం పెరిగినా, జేబు నుంచి అదనంగా వేల రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. కోటి రూపాయల విలువైన ఆస్తిపై ఈ పెంపు లక్షల్లో ఉండే అవకాశం ఉంది. ఈ మార్పుల నేపథ్యంలో రాష్ట్ర రాజధాని పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద జనం రద్దీ ఒక్కసారిగా పెరిగింది. పెరిగిన రద్దీని తట్టుకోవడానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అదనపు సమయం పనిచేస్తున్నాయి. కొత్త ధరలు అమలులోకి రాకముందే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని కొనుగోలుదారులు ఆరాటపడుతున్నారు. బిల్డర్లు కూడా తమ క్లయింట్లను త్వరగా పేమెంట్స్ పూర్తి చేయాలని కోరుతున్నారు. మే మొదటి వారం రియల్ ఎస్టేట్ లావాదేవీలకు అత్యంత కీలకంగా మారింది. కొనుగోలుదారులపై రిజిస్ట్రేషన్ విలువల పెంపు ప్రభావంఈ పెంపు కేవలం రిజిస్ట్రేషన్ ఖర్చులకే పరిమితం కాదు. ఇది హోమ్ లోన్ మొత్తం, నెలవారీ ఈఎంఐలపై కూడా ప్రభావం చూపుతుంది. సాధారణంగా బ్యాంకులు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగానే లోన్ ఇస్తాయి. బేస్ వాల్యూ పెరగడం వల్ల లోన్ అవసరాలు కూడా పెరుగుతాయి. గచ్చిబౌలి, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో ధరలు ఎప్పుడో ఆకాశాన్ని తాకాయని, ఈ సవరణ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం రెండేళ్ల క్రితమే ఈ రేట్లను సవరించింది. తాజా అప్‌డేట్‌తో ప్రభుత్వ ఆదాయం ప్రస్తుత మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా మారుతుంది. కొనుగోలుదారులు తమ బడ్జెట్‌ను మరోసారి లెక్కించుకోవడం మంచిది. పెరిగిన రిజిస్ట్రేషన్ ఖర్చుల గురించి లీగల్ ఎక్స్‌పర్ట్స్ లేదా బిల్డర్లను సంప్రదించి స్పష్టత తెచ్చుకోవాలి. కొత్త స్లాబ్ రేట్లపై అవగాహన ఉంటేనే సరైన ఆర్థిక నిర్ణయం తీసుకోగలరు. ధరల పెంపు వల్ల లావాదేవీలు తాత్కాలికంగా తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, హైదరాబాద్‌లో ఐటీ నిపుణుల నుంచి ఇళ్లకు ఉన్న డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. దీర్ఘకాలంలో ఆస్తి విలువ పెరగడం వల్ల ఈ ప్రారంభ ఖర్చులు పెద్ద సమస్య కాకపోవచ్చు. దీనికి సంబంధించి అధికారిక నోటిఫికేషన్లు త్వరలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరనున్నాయి.

# 17 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం స్టాక్ మార్కెట్లోకి దూసుకొస్తున్న పీఆర్ దిగ్గజం!

వ్యాల్యూ 360 కమ్యూనికేషన్స్ స్టాక్ మార్కెట్ ప్రయాణం ఈ సోమవారం, మే 4 నుంచి ప్రారంభం కానుంది. ఈ సంస్థ తన ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ను చీూజు జుఎవతీస్త్రవ ప్లాట్‌ఫామ్‌పై లాంచ్ చేస్తోంది. ఢిల్లీలో ఒక చిన్న సంస్థగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన 17 ఏళ్ల తర్వాత, ఈ స్థాయికి చేరుకోవడం విశేషం. భారత స్టాక్ మార్కెట్‌లో ఒక సర్వీస్ బేస్డ్ కంపెనీ ఇలా పబ్లిక్ ఇష్యూకి రావడం చాలా అరుదైన విషయమని చెప్పాలి. ఎటువంటి బయటి పెట్టుబడులు లేకుండా ఎదిగిన ఈ సంస్థ, నేడు భారతదేశంలోనే అగ్రగామి పబ్లిక్ రిలేషన్స్ పవర్‌హౌస్‌గా అవతరించింది. వ్యవస్థాపకులు కునాల్ కిషోర్, గౌరవ్ పాత్ర మొదటి నుంచి ఈ సంస్థను ఎంతో దార్శనికతతో నడిపించారు. సర్వీస్ రంగంలోని కంపెనీలు కూడా భారీ సంపదను సృష్టించగలవని వీరు నిరూపించారు. ఒక చిన్న ఆఫీసు నుంచి మొదలైన వీరి ప్రయాణం నేడు ఎంతోమంది ప్రాంతీయ పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. వ్యాల్యూ 360 ఐపీఓ: కీలక వివరాలు ఇవే.. వ్యాపార విస్తరణ, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ఈ లిస్టింగ్ ద్వారా నిధులను సేకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. సాధారణంగా పీఆర్ ఏజెన్సీలు స్టాక్ మార్కెట్‌లోకి రావడం చాలా అరుదని మార్కెట్ నిపుణులు గమనిస్తున్నారు. ఢిల్లీ ప్రాంతంలోని ఇతర సర్వీస్ స్టార్టప్‌లకు ఇది ఒక కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తోంది. బలమైన ఆర్థిక రికార్డుతో ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లను ఆకర్షించాలని కంపెనీ భావిస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు లాట్ సైజువివరాలను జాగ్రత్తగా గమనించాలి. చిన్న ఇన్వెస్టర్లు కూడా ఈ ఐపీఓలో పాల్గొనేలా ప్రతి లాట్‌లో నిర్ణీత సంఖ్యలో షేర్లను కేటాయించారు. అయితే, బిడ్ దాఖలు చేసే ముందు రిస్క్ ఫ్యాక్టర్లను కూడా క్షుణ్ణంగా పరిశీలించడం ముఖ్యం. కంపెనీ చరిత్రపై సరైన రీసెర్చ్ చేయడం వల్ల ఇన్వెస్టర్లు సరైన నిర్ణయం తీసుకోగలుగుతారు. ాాఎజవతీఅంవవఎవత్ ఇన్వెస్టర్లు ఐపీఓ టైమ్‌లైన్, ప్రైస్ లిమిట్స్ గురించి తెలుసుకోవడం చాలా అవసరం. ఈ వారం సబ్‌స్క్రైబ్ చేసుకోవాలనుకునే వారి కోసం ముఖ్యమైన తేదీలు, ఇష్యూ స్ట్రక్చర్ కింద ఇవ్వబడ్డాయి. సబ్‌స్క్రిప్షన్ విండో ఓపెన్ అయ్యేలోపు ఇన్వెస్టర్లు తమ డీమ్యాట్ ఖాతాలను సిద్ధం చేసుకోవడం మంచిది. ఈవెంట్ వివరాలు ముఖ్య సమాచారం ఐపీఓ ప్రారంభ తేదీ మే 4, 2026 లిస్టింగ్ ఎక్స్ఛేంజ్ చీూజు జుఎవతీస్త్రవ బిజినెస్ మోడల్ పీఆర్ మరియు కమ్యూనికేషన్స్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ, ఇండియా స్థాపించిన సంవత్సరం 2009 కేవలం అంకెలే కాదు, ఈ ఐపీఓ ఎంతోమంది నమ్మకమైన ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపనుంది. కంపెనీలో ఈక్విటీ కలిగిన పాత ఉద్యోగులకు లిస్టింగ్



ద్వారా మంచి లాభాలు చేకూరనున్నాయి. వారి కష్టానికి ఇది ఒక గొప్ప బహుమతి అని చెప్పవచ్చు. కార్పొరేట్ విజయాల్లో ఉద్యోగులకు కూడా భాగస్వామ్యం ఉంటుందనే విషయాన్ని ఈ వ్యాల్యూ 360 స్టోరీ చాటిచెబుతోంది. వ్యాల్యూ 360 కమ్యూనికేషన్స్ వృద్ధి వ్యూహం ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను డిజిటల్ టూల్స్ అప్‌గ్రేడ్ చేయడానికి ఉపయోగించాలని మేనేజ్‌మెంట్ ప్లాన్ చేస్తోంది. సాంప్రదాయ కమ్యూనికేషన్ పద్ధతులకు అత్యాధునిక టెక్నాలజీని జోడించాలని వారు భావిస్తున్నారు. గ్లోబల్ మీడియా రంగంలో పోటీని తట్టుకుని, దీర్ఘకాలిక వృద్ధిని సాధించడానికి ఈ పెట్టుబడులు ఎంతో కీలకం. లిస్టింగ్ తర్వాత కూడా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పైనే కంపెనీ ప్రధానంగా దృష్టి సారించనుంది. ఈ పరిణామం ఇతర చిన్న ఏజెన్సీలకు కూడా స్ఫూర్తినిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. స్పెషలైజ్డ్ సర్వీస్ మోడల్‌తో కూడా అద్భుతమైన ఆర్థిక వృద్ధిని సాధించవచ్చని ఇది నిరూపించింది. ఢిల్లీకి చెందిన ఈ సంస్థ తన రంగంలోని ఇతర కంపెనీలకు ఒక గట్టి పోటీని ఇస్తోంది. ఈ ఐపీఓ విజయవంతమైతే, భారతదేశంలో మరిన్ని ప్రొఫెషనల్ సర్వీస్ కంపెనీలు లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత మార్కెట్‌లో ఉన్న సానుకూల వాతావరణం ఈ ఐపీఓకు కలిసొచ్చే అంశం. ఎమర్జింగ్ ప్లాట్‌ఫామ్‌లు చిన్న కంపెనీలకు పెద్ద ఎత్తున గుర్తింపునిస్తున్నాయి. వ్యాల్యూ 360 కూడా స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటోంది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ అవ్వడం వల్ల కంపెనీ బ్రాండ్ వాల్యూ మరింత పెరగనుంది. బిడ్డింగ్ ప్రారంభం కావడంతో అందరి దృష్టి ఇప్పుడు మార్కెట్ డిమాండ్, లిస్టింగ్ గెయిన్స్‌పైనే ఉంది. దాదాపు రెండు దశాబ్దాల కష్టానికి దక్కిన ఫలితంగా ఈ ఐపీఓను చూడవచ్చు. ఇన్వెస్టర్లు, ఉద్యోగులు అందరూ ట్రేడింగ్ బెల్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ సర్వీస్ జెయింట్‌కు మార్కెట్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.



## ఓటీటీలో దూసుకెళ్తున్న 'డ్రింకర్ సాయి'

ధర్మ మహేష్ హీరోగా కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో ధర్మ మహేశ్ హీరోగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కిన ఈ చిత్రం 2024 డిసెంబర్‌లో థియేటర్స్‌లో విడుదలై యావరేజ్ టాక్ సంపాదిం చుకుంది. కానీ దాదాపు ఏడాదిన్నర ఓటీటీలోకి వచ్చి.. ఇక్కడ మంచి టాక్‌తో దూసుకెళ్తోంది. జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం ప్రస్తుతం ఫ్రీ ఆన్ జీ5 విభాగంలో టాప్-1 ట్రెండింగ్ మూవీగా దూసుకుపోతూ ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకుంటోంది. ఈ సినిమాలో ఒక సాధారణ యువకుడి జీవితంలో జరిగే పరిణామాలను, అతని ప్రేమ, ఆత్మగౌరవం, భావోద్వేగ సంఘర్షణలను ధర్మ మహేష్ ఎంతో నేచురల్‌గా నటించారు. కొన్ని కీలక సన్నివేశాల్లో ఆయన ఎక్స్‌ప్రెషన్స్, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. అందుకే థియేటర్లలో మంచి పేరు తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో మరింత పెద్ద స్థాయిలో ఆదరణ పొందుతోంది. అలాగే ఈ చిత్రంతో బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా దుబాయ్‌లో జరిగిన గామా అవార్డ్ అందుకున్నారు ధర్మ మహేష్. హీరోయిన్‌గా నటించిన ఐశ్వర్య శర్మ తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఆమెకు ధర్మ మహేష్‌తో ఉన్న కెమిస్ట్రీ సినిమాకు మరో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. అలాగే రీతూ చౌదరి, పోసాని కృష్ణ మురళీ, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, భద్రం, కిర్రాక్ సీత, ఫన్ బకెట్ రాజేష్, రాజ ప్రజ్వల్ తదితరులు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేసి కథను మరింత బలపరిచారు.




## సందీప్ రెడ్డి వంగా బ్యానర్‌లో మ్యూజికల్ కామెడీ.. 'రోమాంచకం' ఫస్ట్ లుక్ రిలీజ్

'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్' (రాజూఅతీత్) 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్, ప్రభాకర్ రెడ్డి వంగా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లలో ప్రభాస్ షర్ట్‌లెస్ లుక్‌లో, ఒంటిపై గాయాలు, బ్యాండేజీలతో కనిపించి అభిమానుల్లో భారీ అంచనాలను పెంచేశారు. లాంగ్ హెయిర్, గడ్డం, మీసాలతో ఉన్న ప్రభాస్ లుక్.. సందీప్ వంగా మునుపటి చిత్రం 'యానిమల్'లో రణబీర్ కపూర్ లుక్‌ను గుర్తుచేసేలా ఉందని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమాలో తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారు.

## రూ.300 కోట్ల క్లబ్‌లోకి 'కరుప్పు'.. బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న సూర్య డివైన్ బ్లాక్‌బస్టర్




తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. ఇప్పటికే రెండు వారాల విజయవంతమైన రన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మూడో వారంలోకి కూడా అదే జోరుతో అడుగుపెట్టింది. సాధారణంగా పెద్ద సినిమాల వసూళ్లు రెండో వారానికే తగ్గుముఖం పడుతుంటాయి. కానీ 'కరుప్పు' మాత్రం వీక్‌డేస్‌లో కూడా బలమైన కలెక్షన్లు నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జి.కె. విష్ణు అందించిన అద్భుతమైన విజువల్స్ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ నిర్మాణ విలువలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. మూడో వారంలో కూడా థియేటర్లలో బలమైన ఆక్యుపెన్సీ కొనసాగుతుండటంతో ఈ చిత్రం ఫైనల్ రన్ ముగిసే సమయానికి మరిన్ని చారిత్రాత్మక రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్య కెరీర్‌లోనే కాకుండా, తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.

## 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' సీజన్ 3 ట్రైలర్ రిలీజ్.. జూన్ 22 నుండి స్ట్రీమింగ్!




హాలీవుడ్ పాపులర్ ఫాంటసీ డ్రామా సిరీస్ 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్' సీజన్ 3 ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. వెస్టరోస్ సామ్రాజ్యంలో ఐరన్ థ్రోన్ కోసం జరిగే భీకర పోరాటాన్ని కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నట్లు తెలుస్తుంది. రక్తపాతం లేకుండా కింగ్స్ ల్యాండింగ్ నగరాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రైలర్ ప్రారంభంలో రాన్యా టార్గేరియన్ చెప్పినప్పటికీ, పరిస్థితులు దానికి భిన్నంగా మారి ఆమె తన డ్రాగన్లు, సైన్యంతో నగరాన్ని ముట్టడించడం, అది అగ్నికీలల్లో చిక్కుకోవడం ఇందులో చూపించారు. ముఖ్యంగా అత్యంత రక్తపాతంతో కూడిన నౌకా యుద్ధంగా పేరొందిన 'బాటిల్ ఆఫ్ ది గల్లెట్'ను ఈ సీజన్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ క్రేజీ సిరీస్ భారతదేశంలో జూన్ 22 నుంచి 'జియోహాట్‌స్టార్' ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

## యాక్షన్ మోడ్‌లో కరిష్మా కపూర్.. ఆసక్తికరంగా 'బ్రౌన్' ట్రైలర్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే ప్రక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, "రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఆమెలో ఎన్నో లోపాలు, బలహీనతలు ఉన్నప్పటికీ, జీవితంలో ముందుకు సాగే పట్టుదల ఉంది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి" అని పేర్కొన్నారు. అలాగే నటుడు జిష్షు సేన్‌గుప్తా మాట్లాడుతూ, ఈ సిరీస్ కేవలం ఒక సాధారణ సస్పెన్స్ థ్రిల్లర్‌లా కాకుండా, ప్రతి పాత్రలోనూ ఎంతో లోతు, భావోద్వేగాలు ఉంటాయని, కోల్‌కతా నగరం ఈ కథలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచిందని చెప్పారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.



PUBLISHED AND OWNER BY AVANAGANTI ANIL KUMAR Published at 3-83/A, BADANGPET, BALAPUR, RANGAREDDY District TELANGANA - 500058. Printed at SMILYSONLINE 6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District, TELANGANA - 500070. EDITOR AVANAGANTI ANIL KUMAR PRGI NO. : TGTEL/26/A2290 , CELL : 9133444314